కథా నిలయం
1095
శ్రీకాకుళం

# సిల్కు చీర

కాత్యాయినీ వాళ్ళు ఇల్లు ఖాళీచేసి వెళ్ళడం మీనాక్షమ్మకు చాలా కష్టమనిపించింది. ఊరికే కష్టమనిపించడం కాదు. కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. అందులో ఆమె తప్పేమీ లేదు గనుక మీనాక్షమ్మ అశ్రుగర్భితములైన చూపులుచూస్తూ కలిగిన కష్టాన్ని దిగమింగుకొన్నది.

వారిద్దరూ ఒక డాబాలో చెరో భాగంలో నాలుగేండ్ల పాటు కలసి మెలసి ఉండి కాపరాలు చేశారు. ఆ యిల్లుకట్టించిన ఆసామి అసలు ఆ డాబాను రెండు భాగాలుగా అద్దెకివ్వాలనో లేక తన ఇద్దరు కొడుకులకూ సమంగా పంచి ఇవ్వాలనో అల్లా కట్టి ఉంటాడనిపిస్తుంది ఆ డాబాను చూస్తే. ముందు ఒక గది, దాని వెనుక ఒక చిన్న హాలూ, తరువాత రెండు భాగాలనూ కలుపుతూ వరండా. ఆ వరండాకు పదిగజాల దూరంలో వంట గదీ, వంటగదిని అనుకొని స్నానాలగదీ ఉన్నాయి. ముందు గదులను కలుపుతూ విశాలమైన పంచపాళీ.

చెరో ఇరవై అద్దెకింద ఇచ్చేవాళ్ళు. ఎప్పుడైనా ఒక నెల మీనాక్షమ్మవాళ్ళకు అద్దెకింద జమకట్టవలసిన పైకం కొంత తక్కువైతే కాత్యాయిని అడక్కుండానే సర్ది మొత్తం నలభై ఇంటాయనకు అందచేసేది.

కాత్యాయిని భర్త తాలూకా ఆఫీసు గుమాస్తా మీనాక్షమ్మభర్త బడిపంతులు. ప్రొద్దుటపూట వాళ్ళిద్దరూ వెనక వంటగదుల్లో కలిసిఉండి, మధ్యాహ్నం కాసేపు మధ్యగదుల్లో సర్దుకొని, సాయంకాలానికి ముందున్న పంచపాళీ చేరుకొనే వారు.

ఆత్మీయత లనేవి అనుకోకుండానే ఏర్పడేవే కాని కావాలని ప్రయత్నంచేస్తే వచ్చేవి కావు.

మీనాక్షమ్మ భర్త నాగేశ్వర్రావు తనకు వచ్చే వంద రాళ్ళతోనూ సంసారం నడుపుకోవా లనుకొన్నాడు. అందుకనే ఇంత అద్దె తాను భరాయించగలనా అని అనుమానం కలిగింది. అందుకే అతను ఆ యింట్లో ఒక భాగం మాత్రమే తీసుకొన్నాడు. అతను ఆ వాటా పుచ్చుకొన్న వారానికి రెండో వాటాలో వెంకట్రావు వచ్చి చేరాడు.

ఇద్దరూ చేరిన రెండురోజులకే కొత్త పరిచయాలయినాయి.

మరో వారానికి వారిద్దరూ—ఒకరు అటు ఆఫీసుకు మరొకరు ఇటు స్కూలుకు వెళ్ళినా ఆ రెండు భాగాలముందు

తలుపులు బిగించుకొని ఉండవలసిన అగత్యం తప్పింది.

ఆ వచ్చిన ఇద్దరమ్మాయిలూ కొత్తగా కాపరానికి వచ్చినవాళ్ళే ఇద్దరూ ఇక్కడకు వచ్చాకనే పులుసులో తిరగ మోత వెయ్యడం నేర్చుకున్నారు. వా రిద్దరూ "ఏమండీ అంటే ఏమండీ" అని సరిగ్గా వారమైనా పిల్చుకోలేదు. వారం గడవక ముందే కాత్యాయినికి మీనాక్షమ్మను అల్లా పిలవడం ఏదో ఎబ్బెట్టుగా ఉన్నట్లు కన్పించింది. నిమిషంలో వరుసలు కలిపింది కాత్యాయిని.

"ఏమమ్మా వదినా, నీ విల్లా వంట ఆలస్యంచేస్తే మా అన్నగారేమైనా బడికి వెళ్లాలనేనా" అంటూ వంటగదిలోకి వచ్చి, కూర తరిగి ఇచ్చి, కారం ఎంత వెయ్యాలో ఎప్పుడు వెయ్యాలో చెప్పి వెళ్ళేది.

మీనాక్షమ్మకు ఆమెను వరుసపెట్టి పిలవడంకన్నా "కాత్యాయినీ" అని పిలవడమే బాగుందనిపించింది. మూడు నెలలు గడవకముందే వాళ్ళిద్దరికీ ఏమే అంటే ఏమే అను కొన్నంత స్నేహమయింది.

"మనసులు కలవాలే గాని ఆడవాళ్ళకు స్నేహ మెంతలో అవుతుంది" అనుకొన్నాడు నాగేశ్వరావు. కొత్త కాపురం ఎల్లాగా అని మొదట్లో ఉంటూవచ్చిన భయం అతని కిప్పుడు పూర్తిగా పోయింది.

ఎప్పుడైనా బజారుకు బట్టలకొట్టుకు వెళితే ఆ అమ్మాయి లిద్దరూ జంటగా వెళ్ళేవారు; కలిసే వచ్చేవాళ్ళు. కాత్యాయిని ఏ చీరకొంటే తనూ ఆ రకంచీరే కొనేది మీనాక్షమ్మ. కాత్యాయిని కాస్త జాగ్రత్తగా బేరమాడేది. పద్నాలుగు రూపాయల కంటె ఎక్కువ ఖరీదు ఏనాడూ ఏచీరకూ తను పెట్టేదికాదు— మీనాక్షమ్మచేత పెట్టనిచ్చేదీ కాదు. అందుకనే ఇద్దరూ ఒక్కటే రంగు ఒక్కటే ఖరీదుచీరలు కట్టుకొనేవారు.

ఆ ఇంటాయన ఎప్పుడైనా వచ్చి వెళుతుండేవాడు. అలా వచ్చినప్పుడు ఆయన కాసేపు ముందున్న పంచపాళీలో కూర్చుని "ఏదమ్మా అమ్మాయి, కాస్త మంచితీర్థం అందుకో" అనేవాడు. వారిద్దరూ లోపలకువెళ్ళి ఒకరు నీళ్ళల్లో పంచదార కలిపి తెస్తే, మరొకరు మజ్జిగలో నిమ్మకాయపిండి పట్టుకొని వచ్చేవారు. ఆయన మొదట్లో కేవలం అద్దెవసూళ్ళకు వచ్చినా తరువాత తర్వాత మధ్యాహ్నంపూట వచ్చి కాసేపు కూర్చుని దాహం పుచ్చుకొని, సంతోషించి ఆ యిద్దరు పిల్లల్నీ దీవించి వెళుతుండేవాడు. "నా కెంతో సంతోషంగా వుందమ్మా! నిజంగా నా యింట్లో ఇద్దరు కోడళ్లు తిరుగుతున్నట్లుగా వుంది. మీ రిద్దరూ ఇప్పుడు కాకపోయినా పూర్వజన్మలో అక్కాచెల్లెళ్లు అయి ఉంటారమ్మా" అనేవాడు.

ఆమాట ఆయనేకాదు, పాలుపోసే గొల్లదీ ఆమాటే అనేది. వారానికీ పదిరోజులకూ ఇస్త్రీ బట్టలు తెచ్చిఇచ్చే చాకలిదీ ఆమాటే అనేది.

మీనాక్షమ్మకంటే కాత్యాయిని రెండేళ్లు పెద్ద. కాత్యాయిని భర్త మీనాక్షమ్మ మొగుడికంటే వయస్సులో పెద్దవాడే అయినా చదువులో కొంత చిన్న అనే చెప్పాలి. ఇంటరు చదువుతూ చదువు ఆపేసి గుమాస్తా ఉద్యోగంలో చేరి అటు ఉద్యోగంలోనూ, ఇటు జీవితంలోనూ నాలుగేళ్ల అనుభవాన్ని సంపాదించాడు.

నాగేశ్వరావు అల్లాగా వెంకటావుకంటే చదువులో కొంత ఎక్కువే చదివినా కొన్ని విషయాల్లో అతను వెంకట్రావుకు క్రిందచెయ్యే అయ్యేవాడు.

మీనాక్షమ్మకు అతనిమీద కోపంవస్తే అలిగివెళ్ళి కాత్యాయినీవాళ్ళ వాటాలో కూర్చునేది. బడివేళకు కంచంలోకి భోజనం రాకపోయేసరికి గత్యంతరంలేక అతను వెంకటావు ఆఫీసు గదిలోకి వెళ్ళి ఓ క్షణ మేదో మాటాడినట్లు మాటాడి "ఏమండీ కాస్త ఆవిడిగార్ని పిలిపించండి" అంటూ కోపం చల్లారగా మెత్తబడి అడిగేవాడు. అతను చిరునవ్వు నవ్వుతూ కాత్యాయిన్ని పిలిచేవాడు. ఆమె తలుపుచాటున నిల్చుని అన్నగారిని కాస్త మందలించేది. "చిన్నపిల్లనుచేసి అకారణంగా అల్లాగా కోప్పడేస్తా ఎలా!—కాస్తో కూస్తో లోపాలుండకుండానే ఉంటాయా ఏమిటి....అయినా అంత పడేవాళ్ళు ఇక్కడెవ్వరేం లేరు" అనేది.

అటువంటి సమయంలో నాగేశ్వరావుకు మౌనమే శరణ్యం అయ్యేది.

మీనాక్షమ్మ వెనక ఆసరా అట్టే ఉన్న మనిషి కాదు. ఆడ పిల్లకు ఆడవాళ్ళ ఆసరాయే ఎక్కువ కావాలి.

ఆమెకు ఇద్దరు అన్నలూ తండ్రీ ఉన్నారు. తల్లి కానీ అప్పచెల్లెళ్లు కానీ లేరు. మీనాక్షమ్మ పుట్టింట్లో పెద్ద ఆడ దిక్కల్లా నాయనమ్మే. ఆ ముసలావిడ ఆ కుటుంబాన్ని కని పెట్టుకొని ఉంటూవస్తూ "కొడుకుతో ఒరేయి నే నుండగానే పిల్లలకు పెళ్ళిళ్ళు చేయరా చూసిపోతాను" అని పోరుపెట్టి, తన పేరఉన్న పొలం అమ్మి, ముందు ఆడపిల్లకూ తర్వాత ఇద్దరు మొగపిల్లలకూ పెళ్ళిళ్ళుచేసి కొడుకునూ మనుమలనూ, ఆ యింటి క్రొత్త కోడళ్ళనూ చూస్తూ సంతోషంగా దాటి పోయింది.

ఆ ముసలావిడ ఉన్నంతకాలం వంట పనులు మరెవ్వరినీ ముట్టుకోనిచ్చేదికాదు. ఆవిడ పదిమందికి చేసి పెట్టిందే కాని తను ఒక్కరిచేత చిన్న మెత్తు చాకిరీ చేయించుకోలేదు.

"అమ్మా! కాపరానికి వెళ్ళవలసిన పిల్ల దాన్ని కాస్త పని నేర్చుకోనీయవే" అంటే కొడుకుతో ఆ ముసలావిడ "ఏమిటారి నేర్చుకొనేది. అక్కడికి వెళితే ఎల్లాగో వస్తుంది— ఇదేం బ్రహ్మావిద్యా—ఇప్పట్నించే దాన్ని బాధపెట్టడం దేని కిరా" అనేది.

అందువల్లనే మీనాక్షమ్మకు కాపరానికి వచ్చిన కొత్త రోజుల్లో అన్నీ సమస్యలుగానే కన్పించాయి.

ఊరగాయలు పెట్టుకోవడం ఎల్లాగా అన్నది ఒక సమస్య అయింది.

తనకేమో చేతకాదు. తన కెంత చేతనవునో తన సొంత వదినలకీ దాదాపు అంతే. పోనీ అత్తగార్ని పిలిపిద్దామా అంటే—ఆవిడ చాలా పెద్దది—అదీగాక ఇందుకోసం ప్రత్యేకంగా పిలిపిస్తే అంత బాగుండదు. మామిడికాయలు రావడం మొదలు పెట్టినప్పటినుంచీ మీనాక్షమ్మ కీ ఆవిడ ఆలోచనలు ఎక్కువయ్యాయి.

ఆ సమస్యను కాత్యాయిని నిముషంలో తేల్చేసింది. "అదేమిటమ్మా వదినా! ఆ భాగ్యానికి ఇంత ఆలోచనా— ఇంత ఆవేదనా దేనికీ! నాలుగు డబ్బులు జాగ్రత్త పెట్టు; ఇద్దరమూ కలిసి మా అమ్మదగ్గరకుపోయి వద్దామ్" అన్నది కాత్యాయిని.

తల్లికి తా మిద్దరూ బయలుదేరి వస్తున్నట్లు ముందుగా కార్డు వ్రాసి కాత్యాయిని మీనాక్షమ్మను కొంత బలవంతపెట్టి వెంటతీసికొని పుట్టింటికి వెళ్ళింది.

కాత్యాయిని తల్లి పూర్వకాలపు మనిషి. చక్కగా నిండుగా పెద్ద ముత్తైదువలా ఉంటుంది. ఆవిడ మీనాక్షమ్మను తన చిన్నకూతురిలా చూచింది. మీనాక్షమ్మ అక్కడఉన్న ఆ వారం పదిరోజులూ — తానేమో ఆ యింటికిపరాయి పిల్ల

అనిగానీ ఆవిడ కాత్యాయినికి మాత్రమే తల్లి అనిగానీ అనుకో లేదు. అల్లాగని ఆమెకు తోచనేలేదు.

ఆ ఉన్న పదిరోజుల్లో ఆవిడ పిల్లలిద్దరికీ రెండుసార్లు తలంట్లు పోసింది.

వచ్చేరోజున ఇద్దర్నీ కూచోపెట్టి కాళ్ళకు పసుపు రాయించి, కొత్తచీరలు పెట్టి, కొత్తగా అత్తగారింటికి పంపించే టప్పుడుండేటంత ఆరాటంపడి పంపింది.

నాగేశ్వర్రావు—మీనాక్షీ, కాత్యాయినీ ఇద్దరూ అక్కా చెల్లెళ్ళలాగా నవ్వుతూ కొత్త చీరలతో తలంట్లు పోసుకున్న తలల్తో బండిదిగి, ఊరగాయి జాడీలు దింపుకొంటుండం చూచి నిజంగా సంతోషించాడు. వెళ్ళి తెచ్చిన సరుకు ఇళ్ళల్లో సర్దుకో డానికి సాయపడ్డాడు. ఆత్మీయత అంటే ఏమిటో అతని కప్పుడు పూర్తిగా అవగాహనకు వచ్చింది.

వెంకట్రావు గుమ్మంలో ఎదురై తమవంతు జాడీ అందు కొంటూ 'అయితే ఇంకేం చాలా లాభంగానే వచ్చారన్నమాట' అన్నాడు నవ్వుతూ, అత్తగారిసొమ్ము ఎంత అందిందో ఉజ్జా యింపుగా లెక్కవేసుకొంటూ.

తన భార్యకు తల్లిలేనిలోపం దాదాపు తీరిపోయినట్లుగా భావించి సంతోషించాడు నాగేశ్వరావు.

మీనాక్షమ్మ ఇన్ని కనకాంబరాలుకొని ఒత్తుగా దండ అల్లి, రెండుభాగాలు చేసి, తానొకటి పెట్టుకొని రెండోది

కాత్యాయినికిస్తే-కాత్యాయిని కావాలని అప్పటికప్పుడు బజారు నుంచి గులాబీలు తెప్పించి కొన్ని మీనాక్షి జడలో ఉంచేది.

“అదేమిటి కాత్యాయినీ రెండూ ఒక్కసారి దేనికే-అవి రేపు పెట్టుకోకూడదూ” అని మీనాక్షమ్మ అంటే కాత్యాయిని నవ్వుతూ “నీకు తెలియదులే అది అంతే” అనేది.

ఆ లేత గులాబీలు వాలుజడల్లో చక్కగా పొంకంగా అమరి చుట్టూ ఉన్న కనకాంబరాలకు సువాసనలను అందిస్తుండేవి. అల్లాగా పూలు ధరించడం నేర్చుకొన్నాకనే మీనాక్షమ్మ కొడుకు నెత్తుకుంది.

మీనాక్షమ్మ తండ్రి కూతుర్ని పురిటికి తీసికొని వెళ్ళి కోడళ్ళ సాయంతో పురుడుపోసి తీసికొని వచ్చి దిగవిడిచి వెళ్ళాడు. పుట్టింటినుండి వచ్చినప్పటినుంచీ ఆ కుర్రవాడి సంరక్షణ భారమంతా కాత్యాయినే నెత్తిన వేసుకొంది. ‘నీకేం చేతనవునమ్మా వదినా—నీళ్లు నేను పోస్తానుండు’ అని పిల్లవాణ్ణి తీసుకొని కాళ్ళమీద పడుకోపెట్టుకొని, వంటికి నూనె వత్తుగా రాసి నలుగు పెట్టి తలంటి నీళ్ళుపోసేది.

అల్లాగా నీళ్ళు పోస్తుంటే వానలో తడుస్తున్న తామర పూవులా ఉన్న ఆ చంటివాణ్ణి బుగ్గలు సాగదీసి, కాస్త పడిపించి ముద్దు తీర్చుకొనేది కాత్యాయిని.

నీళ్ళుపోసి లోపలకు తీసికొనివెళ్ళి బాగా పొడిగా తుడిచి పౌడరద్ది ముద్దాడుతూ భర్త దగ్గిరకు తీసికొనివెళ్ళి అతని

చేతికిచ్చి ఇస్త్రీ చొక్కా పట్టుకొనివచ్చి తొడిగి నిద్రపుచ్చేది. కాత్యాయిని పూర్వం పక్క భాగంలోకి నాగేశ్వర్రావు ఇంట్లో ఉన్నప్పుడు వెళ్ళేది కాదు. మీనాక్షమ్మ ఇంట్లో చిన్న చెక్క ఉయ్యాల పడ్డాక చనువుగా వెళ్ళడం, పిల్లవాణ్ణి చంక నేసుకొని రావడం పరిపాటయింది.

వారిద్దరి అన్యోన్యమూ చూచి నాగేశ్వర్రావూ వెంకటాద్రివూ ఇద్దరూ సంతోషించారు. కాత్యాయిని ఎంత పొదుపో అంతకంటే ఎక్కువ వెంకట్రావు. "ఆ పొదుపూ ఆ జాగ్రత్తా వారిద్దరికే సరిపోయింది" అనుకొనేది మీనాక్షమ్మ. తనకు తాను అనుకోడమే కాక భర్తతో ఆమాటే అంటూ అతన్ని కూడా పొదుపుగా ఉండమని చెప్పేది.

అతను ప్రొద్దుట ఇంట్లో కాఫీ త్రాగి పదింటికల్లా భోజనం చేసి వెళ్ళినా, మధ్యాహ్నం రెండింటికి ఇంటికి వచ్చేలోగా మరొకసారి కాఫీ తాగేస్తాడు. సాయంకాలం సరాసరి ఇంటికి రాక స్నేహితులతో కలిసి షికారుపోయి కృష్ణా కాఫీభవనంలో హాజరు వేయించుకొని, అనుకోకుండానే పావలా అర్ధా ఖర్చు చేసుకొనివస్తూ ఉంటాడు రోజూ. కాత్యాయిని ఇది కనిపెట్టి మీనాక్షమ్మచేత చెప్పించేది.

"చివరకు నెలకో పదో పదిహేనో తక్కువవడం లేదా?" అని ఒక పక్కన మీనాక్షమ్మ లెక్కవేసి చెబుతున్నా "ఆ ఫరవాలేదులే పావలా అర్ధకూ ఏమిటి" అనేవాడు. ఆమె ఏదో

సలహా చెప్పవస్తే వినుక్కొనేవాడు. ఆ విషయాల్లోనే కాక ఇంకా కొన్ని ఇతరవిషయాల్లో కూడా వాళ్ళిద్దరూ వివాదపడేవారు.

"ఏమిటండీ యింకా వ్రాస్తున్నారూ" అంటే "అబ్బే ఇదే—ఈ ఒక్క పద్యం పూర్తిచేసి ఆపేస్తాను" అనేవాడు.

అల్లా అతను పొద్దుపోయేదాకా ఉండి ఆలస్యంగా నిద్రలేచేవాడు. అటు కాత్యాయిని తూర్పు తెలతెల వారకముందే లేచి అంట్లగిన్నెలు చప్పుడుచేస్తూ అవి దొడ్లో వేసేది. మరో కాసేపట్లో పనిమనిషి వచ్చి కేకవేసేది. మీనాక్షమ్మ లేచి వెళ్ళి కాత్యాయినితోపాటు పని ప్రారంభించేది. పనిమనిషి, వాకిలి చిమ్మి నీళ్ళుచల్లి వెళితే వారు ఇద్దరూ చక్కగా ముగ్గులువేసేవారు. వెంకట్రావు కూడా ఆరింటికల్లా స్నానాదికాలు పూర్తి చేసుకొని ఎన్నడూ తరగని తాలూకా ఆఫీసు కాగితాలు ముందేసుకొని కూర్చునేవాడు.

అప్పటికీ తన భర్త నిద్ర లేవకపోవడం చూచి కొంచెం కోపగించుకునేది మీనాక్షమ్మ. ఆ విషయంలో కూడా వారిద్దరూ వివాదపడేవారు.

ఆమె మొదట మెల్లగా చెప్పేది. అతను "ఊఁ పోదూ ఫరవాలేదులే" అనేవాడు! ఆమె కాస్త ఘట్టిగా చెప్పేది. అతనికి కోపం వచ్చేది. కోపంగా చురచురా చూచేవాడు. ఆమె రోషపడేది. వాదించేది. కొంచెం ఘాటైన వాదోప

వాదాలు జరిగేవి. నీళ్ళు తిరుగుతున్న కళ్ళతో మీనాతమ్మ మూతి బిగించుకొని, చరచరా పక్క వాటాలోకి పోయి కాత్యాయనిప్రక్క చేరేది.

మీనాతమ్మ అట్టే చదువుకొన్న పిల్ల కాదు. భాగ్యవంతుల పిల్లా కాదు. అందువల్లనే ఆమె పెళ్ళిలో నాగేశ్వర్రావుకు చెప్పుకోదగ్గ కట్నాలూ, కానుకలూ ముట్ట లేదు. కేవలం ఆమె అందంచూచీ కుటుంబం మంచిచెడ్డలు చూచీ నాగేశ్వరావు తండ్రి ఆమెను తన కోడలుగా చేసుకొన్నారు. నాగేశ్వర్రావు అందుకు సంతోషించాడు. ఎప్పుడైనా మాటల సందడిలో—అందులోనూ మీనాతమ్మ తనమీద అలిగివెళ్ళి పక్క వాటాలోకి పోయి కూర్చున్నప్పుడు — కాత్యాయని ఆమెను వెనుకేసుకొచ్చినప్పుడు, నాగేశ్వరావు "మీవాళ్ళు నాకేం వేలూ వందలూ కట్నాలు పొయ్యలేదులే" అనేవాడు.

ఆ మాటకు మీనాతమ్మ మరింత రోషపడేది. "కావాలని పదిసార్లు ఏదో వంక బెట్టుకొనివచ్చి చూసి చేసుకొన్నారుగా—ఇప్పుడు మరి దెప్పడం దేనికీ ఆడబడుచుల్లాగా" అనేది. ఆమె అనడం ఆపగానే కాత్యాయని అందుకొని "పోనీండీ అన్న గారూ—ఆ వెంకయ్యగారి అమ్మాయిని మీ కిస్తామన్నారటగా అయిదువేలు కట్నంఇచ్చి—చేసుకోక పొయ్యారూ చక్కగా నల్లగా పోలేరమ్మలా వుండేది" అనేది. ఆ సంబంధం వచ్చిన సంగతి మీనాతమ్మ కాత్యాయనితో చాలాసార్లు చెప్పింది.

కాత్యాయిని ఆమాట అని మీనాక్షమ్మతోపాటు చిరునవ్వులు నవ్వేది.

"అన్నగారిని వెనకేసుకొని రావడంపోయి ఎంతసేపూ వదినగారిపక్షమే పలుకుతారే!" అని వెళ్ళిపోయేవాడతను.

ఇహ ఆరోజు సాయంకాలం కాత్యాయిని ఆమెను అనేకవిధాల అలంకరించి కాటుకపెట్టి, తిలకందిద్ది పిల్లవాణ్ణి నిదరపుచ్చి అతను వచ్చాక తన భాగంలోకి వెళ్ళిపోయేది.

అతను రాత్రిపూట భోజనం పూర్తిచేసి ముందు గదిలోకి వచ్చి టేబిలుముందు కూర్చుని ఏ పుస్తకమో చదువుతున్నట్లో, ఏదో వ్రాసుకొంటున్నట్లో - ఏమో ఆలోచిస్తున్నట్లో నటించేవాడు.

ఒక్కొక్కరోజున ఆ నటన నిజంగా నటనే అయ్యేది. మరోరోజున అతను అంతలో అందులో మునిగిపొయ్యేవాడు.

అల్లాంటి సమయాల్లో వారొకసారి సత్యభామా కృష్ణులయ్యేవారు. వేరొకసారి సుగాత్రీ శాలీనులయ్యేవారు.

"ఏమండీ ఆ పుస్తకాలు చదవకపోతేనేం? ఇంత పొద్దుపోయి .... అదేదో రేపు వ్రాసుకోకూడదూ?" అనేది మీనాక్షమ్మ అమాయికంగా.

పెద్ద విద్యుద్దీపకాంతిలో మీనాక్షమ్మకు నిద్రరాదు. అతనికేమో ఆ ధోరణిలో పడితే నిదర ముంచుకొని వచ్చేదాక చదువుతూ కూర్చుంటే తప్ప నిదరపట్టదు.

"కుర్రాడికి అత్తగారాబాలు ఎక్కువయ్యాయి" అని కొంచెం ఎత్తిపొడిచేవాడు వెంకట్రావు.

పొద్దుటపూట 'అత్త అత్త' అటూ వాడు తప్పటడుగులు వేస్తూ ప్రక్క భాగంలోకి పోయి వాళ్ళింట్లో ఉన్న చిన్న కప్పుతో పడితేనేగాని పాలు తాగేవాడుకాదు. వెంకట్రావు ఆ కుర్రాణ్ణి కొంచెం భయపెట్టేవాడు. మీనాక్షమ్మ వాడు దేనికైనా మంకుతనం పోతే "అదుగో అదుగో మీ మామయ్య వస్తున్నారులే" అనేది. దాంతో వాడు గప్‌చిప్.

అల్లాగా వారిద్దరి కాపరాలు అన్యోన్యంగా అక్క చెల్లెళ్ళ కుటుంబాల్లాగా నడిచాయి ఆ నాలుగేళ్ళూ.

ఆ రెండు భాగాల్లోనూ పాలు వాడుకగా పోసే గొల్లది ఈ మధ్య "అబ్బే వాళ్ళిద్దరూ అప్పచెల్లెళ్ళేనమ్మా — మనతో ఊరికేనే అల్లా అంటారు." అనడం మొదలు పెట్టింది.

ఆ వాడవాడంతా అల్లాగే అనుకొన్నారు. ఆ మాట నిజానికి అబద్ధమే అయినా—అది అబద్ధం అని ఎవ్వరూ అనుకొనేవారుకాదు. అసలు కాత్యాయినీ, మీనాక్షమ్మా వాళ్ళే అనుకొనేవారుకారు.

ఇంతలో వెంకట్రావుకు రెవిన్యూ ఇనస్పెక్టరు పని అయింది. అతన్ని ఆ ఊరినుండి బదిలీచేశారు. బదిలీ చేయించుకోడానికి వెంకట్రావు కొంత ప్రయత్నం చేశాడని మీనాక్షమ్మకు అనుమానం.

"అబ్బే అదికాదమ్మా వదినా — వాళ్ళే బదిలీ చేశారటమ్మా''—అని కాత్యాయిని నాల్గుసార్లు నమ్మకంగా చెప్పినా మీనాక్షమ్మకు ఆ అనుమానం పోలేదు.

మీనాక్షమ్మ అనుమానం ఎల్లాఉన్నా బదిలీ అయ్యాక కాత్యాయినీవాళ్ళు తమ భాగం ఖాళీచేసి వెళ్ళక తప్పిందికాదు.

మీనాక్షమ్మకు చాలా కష్టంవేసింది. నిజంగా కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. కాత్యాయిని మెల్లగా చెప్పి ఓదార్చింది.

"మళ్ళీ కొన్నాళ్ళు పోయాక వీలయితే ఇక్కడికే బదిలీ చేయించుకొంటాము లేవమ్మా వదినా'' అని మరీ మరీ చెప్పి వెళ్ళింది కాత్యాయిని పిల్లవాణ్ని పదిసార్లు ముద్దాడి తల్లిచేతికిస్తూ.

వాళ్ళు వెళ్ళాక నెలరోజులదాకా ఆ వాటా ఖాళీగానే ఉంది. నెల తర్వాత ఆ భాగంలోకి ఒక తహసీల్దారుగారు వచ్చి చేరారు. ఆయనలావచ్చి చేరిన మరుసటిరోజునుంచే ఆ డాబాలో కొన్ని మార్పులు రావడం మొదలుపెట్టాయి.

వారం తర్వాత కొన్ని ఏర్పాట్లు చేశారు తహసీల్దారుగారు.

అంతకుముందే పంపకాల్లో పోట్లాడుకొని, కోర్టువారి తీర్పు వచ్చిన మరుసటిరోజునే—ఇల్లంతా అడ్డంగా నిలువుగా తడికలూ, గోడలూ, పెట్టుకొన్న అన్నదమ్ముల భాగాల్లాగా కన్పించాయి ఆ రెండు భాగాలున్నూ. ముందున్న పంచ

పాళీలో సగంలో తడిక పెట్టుకోవడం చూచి నాగేశ్వర్రావు కష్టపడితే - వెనక డాబాకూ వంటగదికీ మధ్య ఉన్న కాస్త ఖాళీ స్థలంలో తడిక పెట్టడం చూచి మీనాక్షమ్మ కష్ట పడింది. అట్టే పెద్ద ఉపయోగం లేకపోయినా ముందున్న పంచపాళీ పూర్వం చక్కగా, విశ్రాంతిగా, విశాలంగా కన్పిం చేది. ఇప్పుడు మరోలా కన్పించేసరికి అతనికి కష్టమనిపించింది.

వెనుక ఖాళీ స్థలంలో పిల్లవాడు విశ్రాంతిగా ఆడుకొనే వాడు. ఇప్పుడు ఆ స్థలం తగ్గి ఇరుకు అయినట్లుగా అనుకొని మీనాక్షమ్మ కష్టపడింది.

జరగవలసిన ఏర్పాట్లన్నీ జరిగాక ఆ భాగంలోకి ఆడ వారు బండెడు సామానుతో దిగారు. ఆ వచ్చినావిడ ఒకర్తే వచ్చినా పదిమంది దిగినంత అట్టహాసం చేసింది. ఆ తహసీలుదారు గారి భార్య సామాను సర్దించి వంటమనిషి వడ్డిస్తే ఆపూట క్రొత్తభాగంలో తొలిసారిగా భోజనం చేసింది. వంటమనిషి పన్నెండింటికి పని పూర్తిచేసికొని యింటికి పోతూ మీనాక్షమ్మా వాళ్ళ గుమ్మంలో ఓ క్షణం నిలబడి, కొంత భోగట్టా చేసి వెళ్ళింది. వారి భోగట్టాకూడా కొంత వినిపించి వెళ్ళింది.

మరునాడు మీనాక్షమ్మ వంటయింటి వెనుక గుమ్మంలో నిలబడి పిల్లవానికి అన్నం పెడుతుండగా తహసీలుదారు గారి భార్య కన్పించింది పెరట్లో.

ఆమె పెరట్లో చెప్పులు వేసుకొని తిరగడం మీనాక్షమ్మకు చాలా క్రొత్త అనిపించింది. ఆమె పెట్టుకొన్న కళ్ళజోడు ఆమెకు అందం ఇవ్వకపోయినా, దర్జానిస్తున్న వనుకొన్నది. ఇంట్లో ఉన్నప్పుడుకూడా ఆమె అంత ఖరీదైన చీర కట్టిందేమో అని కొంత ఆశ్చర్యపడ్డది మీనాక్షమ్మ.

ఆవిణ్ణి చూపిస్తూ "ఎవలమ్మా — వాల్లు — మన కాచత్తాయి వాల్లు మల్లా ఎప్పలొత్తాలూ?" అని అడిగాడు మీనాక్షమ్మ కొడుకు.

ఆ మాటలు కొన్ని విన్నదో ఏమో ఆవిడ మీనాక్షమ్మ నిల్చున్న గుమ్మంవైపువచ్చి కొంత దూరంలో నిలబడి "ఏమిటంటాడూ మీ అబ్బాయ్" అని అడిగింది.

వచ్చి రెండు రోజులయినా కాస్త ప్రక్కవాళ్ళని పల్కరించాలన్నా అనుకోని ఆవిడకు వెంటనే సమాధానం చెప్పడానికి మీనాక్షమ్మకు అట్టే మనస్కరించలేదు.

అందువల్లనే ఓ క్షణమాగి "ఏంలేదులెండి — మొన్నటి. దాకా మీ వాటాలో మావాళ్ళే ఉండి వెళ్ళారు— ఆవిషయమే అడిగాడు" అని తేల్చేసింది.

ఆవిడ "అహా అల్లాగా" అని లోపలకు వెళ్ళిపోయింది

ఆవిడ అల్లా వెళుతుంటే చూచి "ఈవిడ అట్టే వయస్సులో పెద్దదికాదే. అవును కాత్యాయినికంటె ఓ రెండేళ్ళు పెద్దయితే కావచ్చు — కాని ఆయన్ని చూస్తే .... బహుశా

రెండో....పొద్దూ మన కెందుకు" అని అనుకొని కొడుకునోట్లో మళ్ళీ అన్నంముద్ద పెట్టింది మీనాక్షమ్మ.

ఆవిడకు పిల్లల్లేరని వచ్చిననాడే గ్రహించింది మీనాక్షమ్మ.

ఆవిడగారు పెంచుకొంటున్న పొట్టికుక్కవల్ల ఏం ఇబ్బంది రాబోతోందో అని మొదటే భయపడ్డాడు నాగేశ్వర రావు.

ఆ కుక్క రాత్రిళ్ళు మధ్య మధ్య లేచి పెద్దగా మొర గడం మొదలు పెట్టింది. తాను వెళ్ళి దాన్ని అటు దోల్తోనో, కాకపోతే తమ వంటగదిదగ్గరో కట్టివేసుకోమని చెప్పివస్తానంటే మీనాక్షమ్మ వద్దని భర్తను వారించింది అనేకసార్లు.

తహసీలుదారుగారి భార్య ఆ భాగంలోకి వచ్చిన నెల లోపలనే ఆ రెండు వాటాల ఆడవారికీ ఒక చిన్న తగాదా కూడా వచ్చింది.

మీనాక్షమ్మ కొడుకు తడికపక్కగా వంటగదిదగ్గర పాడుజేశాడు. ఆ నీళ్ళు వాళ్ళ భాగంలోకి పొయ్యాయి. అది అవతలవైపునుండి గమనించిన తహసీలుదారిగారి భార్య తమ వంటమనిషిచేత కబురంపించింది ఆ విషయం చూడమని.

మీనాక్షమ్మకు కోపంవచ్చింది. కొడుకును పిఱ్ఱమీద ఒక్కటి అంటించి, చరచరా వారి వంటయింట్లోంచి అవతల వైపుకు వెళ్ళి మాట్లాడకుండా తడిగుడ్డతో తుడిచి వచ్చింది.

మీనాక్షమ్మ అల్లా తుడుస్తున్నప్పుడు దూరంగా నిలబడి ఆవిడ "ఆ మీరు తుడవనక్కర్లేదు లెండి—మా వంటావిడ తుడుస్తుంది. ఊరికే చెప్పాను" అన్నది కొంచెం హుందాతనం ఒలకపోస్తూ.

మీనాక్షమ్మకు ఒళ్ళుమండింది. అయినా ఒక్క మాటైనా అనకుండా వచ్చేసింది. హాల్లోకి పోయి మూల కూర్చుని అలిగి ఏడుస్తున్న కొడుకు నెత్తుకొని సముదాయించింది.

అప్పటికీ ఆవిడకు కోపం తగ్గలేదు. ఆ కోపం రాత్రి భర్తవచ్చి "ఏం అంత కోపంగా వున్నావ్" అని పరామర్శ చేసేదాకా ఏ కొంచెమూ తగ్గలేదు.

అతను అడిగీ అడగడంతోనే రోషంగా విషయమంతా చెప్పి "ఎంత తాసీలుదారిగారి భార్య అయితే మట్టుకూ అల్లా కబురుచేస్తుందా—పసివాడు తెలియకచేస్తే" అన్నది.

"అయినా నువ్వు వెళ్ళి తుడిచిరావలసిన అగత్యం ఏం పట్టింది!" అన్నాడతను.

"కావాలనే వెళ్ళాను" అన్నది మీనాక్షమ్మ. అతను మరోక్షణమయ్యాక "పోనీయ్—పోనీయ్—అంతటితో పోనిచ్చేసెయ్. ఇరుగు పొరుగు వారితో తగూ పెట్టుకోవడం బాగుండదు" అన్నాడతను.

"ఇది మరీ బాగుంది–నేనా తగూ పెట్టుకొంది–వాళ్ళ దర్జాలుంటే వాళ్ళకే ఉంటాయ్ — ఈ కాస్త విషయానికి తగూ తెచ్చింది ఆవిడా—నేనా?" అని రోషంగా అడిగింది మీనాక్షమ్మ. "అబ్బ పోనిద్దూ" అన్నా డతను.

ఆమె ఆ పూట అంతా అలిగి పడుకొన్నది. ఆమె అభిమానం దెబ్బతిన్నదని అతనికి తేలిగ్గానే అర్థమైంది.

పక్క వాటా ఆవిడచేసిన పని చాలా అనుచితమూ, అన్యాయమూ అయినా ఏమీ అనడానికి వీల్లేదు కనుక అతను ఊరుకున్నాడు.

ఆ కోపంతో మీనాక్షమ్మ పక్క వాటావైపు ఒక్క సారైనా చూడనైనా చూడలేదు మరి రెండునెలలదాకా.

తాసీలుదారిగారి భార్య తాను చేసినపని పొరపాటనీ, ఆ విషయం మెల్లగా ఆవిడకు చెబుదామనీ అనుకొంటూ ఉండగా మరో చిన్న సంఘటన జరిగింది.

ఆవిడగారు పెంచుకొంటున్న పొట్టికుక్క ముందు వరండాలో తడిక పక్కన కూర్చున్నప్పుడు పూర్వం జరిగిన పొరపాటే జరిగింది. మీనాక్షమ్మా వాళ్ళ వరండా అంతా ఆ నీళ్ళు పచ్చగా పాకాయి. కొంత వాసనకూడా వచ్చింది. అది చూడగానే మీనాక్షమ్మలో ఇన్నాళ్ళూ అణగిఉన్న కోపం, రోషం మళ్ళీ రగులుకొన్నాయి.

మీనాక్షమ్మ ముందు వరండాలో నిలబడి ఆవిణ్ని కేక వేసింది. ఆవిడ తడికవరకు వచ్చి ఒయ్యారంగా నిలబడి "ఏమి టండీ" అన్నది మెల్లగా, ఆప్యాయంగా తహసీలుదారిగారి భార్య మనస్సులో తానసుకొంటున్న విషయం చెప్పేయడానికి మంచి అవకాశం వచ్చిందికదా అని అనుకొన్నది. అల్లా అను కొనే ఆవిడ కొంత సౌమ్యంగా చూచింది.

మీనాక్షమ్మ అదేమీ గమనించకుండా రోషంతో "ఇటు చూడండి—మా వరండా అంతా ఖరాబయిపోయింది" అన్నది కోపంగా.

"అవునండీ — పాడుకుక్క — పొరపాటే అయింది. మా వంటావిడ సాయంకాలం వస్తుంది-రాంగానే కడిగిస్తాను" అన్న దావిడ తాపీగా.

ఆవిడ అల్లా తాపీగా మాటాడటం మీనాక్షమ్మకు మరింత రోషం కలిగించింది. ఆవిడ నిర్లక్ష్యంగా అన్నట్లు తోచింది.

"అయితే ఆవిడ వచ్చేదాకా ఇల్లాగే పెట్టుకు కూర్చో మంటారా....?

"పోనీ నన్నేంచెయ్యమంటారూ!"

"ఏంచేస్తారా—వచ్చి కడగండి" అన్నది దురుసుగా మీనాక్షమ్మ.

"షటప్" అన్న దావిడ.

"ఆ ఏడ్చేదేదో సరిగ్గా ఏడ్వండి. ఏదో మాటలు పేలు తున్నా రే!" అన్నది కోపంగా మీనాక్షమ్మ ఆవిడ అన్నమాట ఏదో తిట్టు అనుకొని.

వాళ్ళిద్దరూ మాటలు మార్చుకొన్నారు.

మాటా మాటా అనుకొన్నారు. రెండు నిముషాలు పొయ్యాక ఆవిడ మీనాక్షమ్మ మాటలు వినిపించుకోకుండా జరీచీర కొంగు సద్దుకొంటూ లోపలకు వెళ్ళి తలుపువేసుకొన్నది.

మీనాక్షమ్మ అక్కడే చాలా సేపు నిలబడి చూస్తూ ఉండి పోయింది. రాత్రి భర్తరాగానే విషయమంతా చెప్పి, ఆవిడ అన్నమాటకు అర్థం చెప్పమని అడిగింది.

"ఏంలేదులే — ఊరుకోండి—అని అర్థం" అన్నాడు నాగేశ్వరావు ఒక్క క్షణం ఆలోచించి. వాళ్ళిద్దరికీ కలహం పెరగకుండాఉండే తీరు ఆలోచిస్తూ "ఒసేయ్—ఇహ నువ్వు ఊరుకో, కాస్త అ విషయం మర్చిపో— రేపు నే నాయనతో చెప్పి సద్దేస్తాను" అన్నాడతను నెమ్మదిగా.

ఆవిడ కాలేజీచదువు కొంత వెలగబెట్టిందని అతనికి తెలుసు. సగం సగం చదువులు చదివిన ఆడవాళ్ళు కొందరు ఇల్లాగే ప్రవర్తిస్తుంటారనీ అతనికి తెలుసు.

అందుకే మనస్సులో విసుక్కొన్నాడు. భార్యకు జరిగిన పరాభవానికి అతనికి కష్టం కలిగింది. "పోనీ నువైనా

దేనికి చెప్పూ—తగూ పెంచుకోవడం — మన పనిమనిషిచేత కడిగించివేస్తే పొయ్యేదిగా" అన్నాడు నాగేశ్వరావు. ఆ మాటకు మీనాక్షమ్మకు కోపంవచ్చింది; ఆవిణ్ని వెనకేసుకొస్తున్నట్లుగా అనిపించింది. మరింత రోషపడి "అవును నేనంత తక్కువదాన్ననేగా — మీరు పడి ఊరుకోమనడం — నేనేం పడను. పోనీ ఆవిడగారు అంతకుముందు ఆపనేచేస్తే బాగుందీ!" అన్నది.

"ఇద్దరు చేసినపనులూ బాగుండలేదు" అన్నాడు నాగేశ్వరావు.

ఆమె మళ్ళా అలిగింది. నాగేశ్వరావుకు చిక్కు సమస్యే వచ్చింది.

భోజనాలయ్యాక అపూట అతను ఆమెను కాస్త ఓదార్చి పిల్లవాణ్ణి ఎత్తుకొని రెండో ఆటకు సినిమాకు తీసికొని వెళ్ళాడు.

ఆ వెన్నెలరాత్రి అతనితో అల్లా వెళ్ళి తిరిగివచ్చాక - ఆమె మనస్సులో పేరుకొన్న కోపం కొంత తగ్గింది. మరునాడు ఉదయంపూట నాగేశ్వరావు పత్రిక్క వాటా వారి గుమ్మం దగ్గరకు వెళ్ళాడు. గుమ్మానికి గుడ్డతెర ఒకటి పల్చనిది వేలాడుతూ ఉన్నది.

లోపల ఆయన తన బల్లముందు కూర్చుని ఏదో వ్రాసుకొంటున్నారు.

అత నక్కడ ఒక్కక్షణం నిలబడ్డాడు.

పత్రిక్క వాటా వారి లోపాలన్నీ ఒకటొకటే ఎవరో ఎత్తి చూపించినట్లుగా కన్పించడం మొదలు పెట్టాయి.

వారా కుక్కను ఆఫీసుగదిలో వదిలిపెట్టి తలుపులు వేస్తారు. అది రాత్రిళ్ళు ఒకటే మొరుగుడు. తన కెన్నోసార్లు చదువు కొంటున్నప్పుడూ, వ్రాసుకొంటున్నప్పుడూ ఇబ్బంది కలిగింది.

వారు రేడియో పెట్టుకొనడం తప్పు కాదు గాని ప్రక్క వాళ్ళకు బాధాకరంగా మ్రోగించడం బాగుండలేదు.

అవన్నీ అల్లా ఉండగా ఆవిడగారి ప్రవర్తన చాలా అవమానకరంగా ఉన్నది.

ఆ చివరి ఆలోచనతో అతను ముందుకు అడుగు వేశాడు.

ఆయన నాగేశ్వరావును చాలా గౌరవించారు. అతి సౌమ్యంగా మాటాడారు.

"మీరు కవిత్వమదీ వ్రాస్తారటగదా" అని అడిగారు.

అన్నీ అడిగాక నాగేశ్వర్రావుకు కోపం తగ్గిపోయింది. అతను చిరునవ్వునవ్వి ఊరుకొన్నాడు. చివరకు ధైర్యంచేసి తను చెప్పదల్చుకొన్నది నాల్గు ముక్కల్లో చెప్పేసి "చూడండీ మనం ఇరుగుపొరుగున ఉన్నాము. కాస్త కలిసి మెలిసి ఉంటే నాకు మనస్సు ప్రశాంతంగా ఉంటుంది" అన్నాడు.

వారు మెల్లగా "అవునండీ నాకూ అదే ఆశయం కాని చదువుకొన్నదైనా దానికి అది తెలియదు. అయినా నేను చెప్పి సర్దేస్తాను. ఈసారికి మీరు క్షమించండి" అన్నారు.

ఆయన అంతమాట అనేసరికి నాగేశ్వరరావు తను ఆ విషయం వారితో ఫిర్యాదు చెయ్యకుండాఉంటే బాగుండేది అనుకొన్నాడు,

వారిద్దరూ అన్యోన్యంగా మాటాడుకొన్నారు కొంత సేపు. ఇద్దరు విద్యావంతులు తమ తమ భార్యల లోపాలనూ, మన స్తత్త్వాలనూ, తమ కుండవలసిన సభ్యతలనూ బాగా ఎరిగి ఉన్న వాళ్ళలాగా ప్రవర్తించారు. ఒకరికొకరు నమస్కారాలు చేసుకొని శెలవు పుచ్చుకోవడాలతో వారిద్దరి హృదయాలూ తేలికయ్యాయి.

అతను నెమ్మదిగా బయటకు వచ్చి నిలబడ్డాడు. అంతలో ఇంటిముందు బండీ ఒకటి వచ్చి ఆగింది.

మీనాక్షమ్మ లోపలనుంచి గబగబా వచ్చి గుమ్మంలో నిలబడింది ఎవరా వచ్చిందీ అని ఆత్రంగా చూస్తూ. -

బండిలోంచి నలభై ఏళ్ళ ముత్తైదువ దిగుతూనే మీనాక్షమ్మను చూచి ఆమె దగ్గరకు వచ్చి "ఇక్కడ మా అమ్మాయి వాళ్ళున్నారామ్మా ఈ భాగంలో?"అని అడిగింది.

ఆవిడ ఒకవేళ కాత్యాయినికి పినతల్లేమోనని భ్రమ పడుతూ మీనాక్షమ్మ "ఎవరండీ" అని అడిగింది.

"అదేనమ్మా—మా అల్లుడు ఏదో తాసీలుదారు ఉద్యోగం చేస్తున్నాడు — వాళ్ళు ఏ భాగంలో ఉంటా" రని అడిగింది.

"ఆహో-అల్లాగా. అయితే ప్రక్క భాగంలోకి వెళ్ళండి" అని నిరుత్సాహపడి మీనాక్షమ్మ చరచరా లోపలకు వెళ్ళింది.

వారి వరండాలోనే నిలబడిఉన్న నాగేశ్వర్రావు వారిని కేకవేసి పిల్చి చెప్పాడు.

ఆవిడ లోపలకు వెళ్ళింది. వెళ్ళి కూతుర్ని పరామర్శించింది. నాగేశ్వరావు తన భాగంలోకి వచ్చి భార్యవంక గర్వంగా చిరునవ్వు నవ్వుతూ చూచాడు.

కూతురుకీ అల్లుడికీ అపూట ఆవిడే వడ్డించింది. తహసీలుదారిగారిభార్య తల్లిరాకకు లోపల సంతోషించినా, అంతకు ముందే కలిగిన మనఃక్లేశాన్ని కప్పిపుచ్చుకోలేక పోయింది. అందుకే మనసు విప్పి మాటాడలేక మౌనం వహించింది.

భోజనాలప్పుడు తహసీలుదారు తన భార్యను గురించి అత్తగారితో ఫిర్యాదుచేశాడు.

పూర్వం తహసీలుదారు ఉద్యోగమంటే పెద్ద ఘనమైన ఉద్యోగంగా ఎంచబడేది. ఆ ఉద్యోగులూ అల్లాగే అనుకొనేవారు. కాని అన్నిరకాలకంట్రోళ్ళూ, రేషనింగులూ, వచ్చాక అది మామూలు ఉద్యోగమయిపోయింది.

వీరు రేషనింగ్ తాసీలుదారు. అందువల్లనే వారు తన ఉద్యోగం చూచుకొని ఎన్నడూ గర్వపడలేదు.

అల్లుడి ఫిర్యాదు విన్నాక ఆవిడ కూతుర్ని నెమ్మదిగా మందలించింది.

వాళ్ళ సంభాషణలూ, ఆ విడ మందలింపులూ మీనాక్షమ్మ వాళ్ళకు స్పష్టాస్పష్టంగా వినపడుతూనే ఉన్నాయి. మీనాక్షమ్మ తనూ వంతుకుపోయి పంతానికి ఆ పని చెయ్యకుండా వుంటే బాగుండేది అనుకొన్నది.

ఆ విషయమే అనుకొంటూ, ఆ రాత్రి ఆమె పిల్లవాణ్ణి చిచ్చికొట్టి నిద్రపుచ్చుతూ, ఏదో వ్రాసుకొంటూ కూర్చున్న భర్తవంక చూస్తూ నిద్రపోయింది.

మరునాడు పొద్దున్న ముగ్గులు వేస్తుండగా తహసీలు దారుగారి అత్తగారు మీనాక్షమ్మను పల్కరించింది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక ఆవిడ మీనాక్షమ్మ కూర్చున్న గదిలోకి వచ్చి కూర్చుని "ఏమమ్మాయ్ — నీకు పిల్లలూ — ప్రస్తుతానికి ఆ కుర్రాడొక్కడేకదూ!" అంటూ ఎంతో చనువుగా అడిగింది.

"అవునండీ" అన్నది అప్రియత్నంగా సిగ్గుపడుతూ మీనాక్షమ్మ.

"బాగుందమ్మా బాగుంది. ముత్యంలాంటి కొడుకును కన్నావ్ — మీ అమ్మ ఎంత సంతోషిస్తున్నదో!" అన్నది ఆవిడ తన కట్టి సంతోషం గత నాలుగేళ్ళనుంచీ కలుగకపోవడాన్ని జ్ఞాపకంచేసుకొంటూ.

"మా అమ్మ లేదండీ"

"అయ్యో పాపం అల్లాగా" అని ఆవిడ ఎంతో నొచ్చుకొన్నది.

కొంతసేపయిన తరువాత ఆవిడ కాస్త ముందుకు జరుగుతూ "చూడమ్మాయ్ నీ పేరేమిటి!" అని అడిగింది ప్రేమగా. మీనాక్షమ్మకూడా ముద్దుగానే చెప్పింది.

"చూడమ్మా మీనాక్షీ — మా అమ్మాయ్ చూశావూ ఒట్టి దుడుకుపిల్ల — సరే — మీ రిద్దరూ చిన్నపిల్లలూ— నేను కాస్త పెద్దదాన్ని కనుక ఓమాట చెబుతా వింటావూ" అన్నదావిడ.

"చెప్పండీ"

"అయితే నేనొక పనిచేస్తానుండు" అని లేచివెళ్ళి కూతుర్ని వెంటబెట్టుకొని వచ్చింది. తహసీలుదారుగారిభార్య రాగానే మీనాక్షమ్మలేచి చాపవేసి కూర్చోండి అంటూ మర్యాద చేసింది. మీనాక్షమ్మ ఆమె తల్లికి దగ్గరగా నేలమీద కూర్చున్నది. తహసీలుదారిగారి భార్య ఆమె వారికి కొంచెం దూరంలో చాపమీద చీద నలగకుండా కూర్చున్నది.

మరో గంటకు ఆమె తల్లిచేసిన సత్ప్రియత్నంవల్ల వారిద్దరూ నిష్కపటంగా, స్నేహంగా మాటాడుకొన్నారు.

వారు లేచి వెళ్ళబోతున్నప్పుడు ఒక్కక్షణ మాగమని మీనాక్షమ్మ లేచివెళ్ళి, అలమారలో ఉన్న కుంకుమభరిణతెచ్చి, ఇద్దరికీ బొట్టుపెడుతూ "మీపేరేమిటండీ" అని తాసీలుదారిగారి భార్యను మర్యాదగా వొంకంగా అడిగింది.

"కమలాదేవండీ" అన్నదామె.

"అబ్బ ఎంతనీచే నీకు-అమ్మాయ్. మేమంతా కమలా అని అంటామ్" అని కూతురువెంట లోపలికి వెళుతూ—చిన్న పిల్లయినా ఎంత బుద్ధిమంతురాలమ్మా" అనుకొన్నది ఆవిడ.

ఆవిడ అక్కడ వారంరోజులుంది.

ఆ వారంలో ఆ రెండువాటాలవారికి కొంత పరిచయాలయినాయి.

పరిచయమైనకొద్దీ మీనాక్షమ్మకు కమలాదేవి స్వభావం అర్థంకాకుండా వచ్చింది.

ఆవిడ తనకంక తను చూస్తున్నప్పుడు ఒక రకంగానూ తను చూడడంలేదనుకొన్నప్పుడు మరొకరకంగానూ చూస్తుండటం మీనాక్షమ్మకు కొంచెం కష్టంగానే ఉండేది

ఆవిడ తరచు సినిమాలకు వెళుతుండేది. ఊళ్ళోకి వచ్చిన ప్రతిసినిమా ఆవిడ చూడవలసిందే. అప్పుడప్పుడు ఆవిడ బలవంతపెట్టి మీనాక్షమ్మనుకూడా వెంటతీసికొనివెళ్ళేది. టికెట్ల కయితేనేం, రానూపోనూ బండ్లచార్జీల కయితేనేం, అయిదారు రూపాయలు ఖర్చయ్యేవి, ప్రతిసారి డబ్బు ఆవిడే ఖర్చుపెట్టేది. "పోనీ నావంతైనా నన్ను ఇచ్చుకోనీయండి" అంటే ఆవిడ మీనాక్షమ్మను ఇవ్వనిచ్చేదికాదు.

మీనాక్షమ్మకు అందుకనే కష్టంవేసి ఆవిడతో సినిమాకు వెళ్ళడం మానుకొన్నది. ఒకవేళ ఆవిడ అంగీకరించినా కొన్ని

సార్లయినా తడవకు అయిదు రూపాయలు సినిమాకు ఖర్చు పెట్టే తాహతు తనకు లేదని మీనాక్షమ్మకు తెలుసు.

ఆవిడ బజారు హోటళ్ళనుండీ, మిఠాయి దుకాణాల నుండీ ఏవేవో చాలా తెప్పింస్తుండేది తరచు. తెప్పించినప్పు డల్లా కొన్ని మీనాక్షమ్మకు పంపించేది.

మొదట్లో పుచ్చుకొన్నా తర్వాత తర్వాత "మావారు కోప గిస్తారండీ" అంటూ పుచ్చుకొనేదికాదు. ఇల్లా కొన్ని విషయాల్లో మీనాక్షమ్మకు కొంచెం కష్టం కలిగినమాట నిజమే అయినా— ఏమైనా తర్వాత నెలలో వారిద్దరికీ మంచి స్నేహం కుదిరిం దనే చెప్పాలి.

"రావమ్మా మీనాక్షమ్మా—కాసేపు రేడియో పాటలు విందువుగాని" అని పిల్చేది కమలాదేవి మధ్యాహ్నం పూట. ఆమె పిల్లవాణ్ని చంకనేసుకొని వెళ్ళేది. వాడా పాటలు వింటూ ఎగురుతూ గంతులువేస్తూ అల్లరి చేసేవాడు. వాడికేం అర్థమయి—పాటలు అంత ఆనందం కలిగించాయా అని అను కొంటూ సంతోషించేది మీనాక్షమ్మ.

కమలాదేవిగారి కళ్ళు ఎప్పుడూ వాడిమీదే ఉండేవి— వాడక్కడ ఉన్న వస్తువులు ఏం పాడుచేస్తాడో అని చాటు గానూ, బహిరంగంగానూ భయపడుతూనే ఉండేది ఆవిడ.

మీనాక్షమ్మ ఆ విషయాన్ని గమనించి వాడి అల్లరిని అతి కష్టంమ్మీద ఆపించి — వాడి ఆనందాన్ని, స్వేచ్ఛనూ ఆటంకపరచి తగు జాగ్రత్త తీసుకొనేది.

కమలాదేవి అట్టే అందమైన మనిషి కాకపోయినా ఆవిడచేసుకొనే షోకులవల్ల కాస్త మెరుస్తూనే ఉంటుంది. రిస్టు వాచీ, కళ్ళజోడూ, పెట్టుకొనే ఆడపిల్లలను చూస్తే నాగేశ్వర్రావుకు అట్టే గిట్టదు.

చెప్పులు తొడుక్కొని వంటయింట్లోంచి కూడా వెళుతూ ఉండటం ససేమిరా గిట్టదు మీనాక్షమ్మకు. స్నేహమయింది గనుక "మన కెందుకులే" అనుకొని ఊరుకొనేది.

ఆఫీసరుగారి భార్య — అందులో ఇంటరు చదువు కొన్నది — అంతమాత్రం దర్జా పోవడం అబ్బురమూకాదు — ఆశ్చర్యమూ కాదు" అనుకొనేవాడు నాగేశ్వర్రావు. అతను ఆమెను ఒకటి రెండుసార్లు మాత్రమే సరిగా చూచాడు.

"ఆ షోకులు మా ఆవిడాచేస్తే ఈవిడకంటే కనీసం వెయ్యిరెట్లు ఘనంగా మెరుస్తుంది" అనుకొనేవా డతను.

కమలాదేవి అతన్ని నిదానంగా, తొందరగా — చూచీ చూడనట్లుగా — నిర్భయంగా చాలాసార్లు చూచింది.

నాగేశ్వర్రావు అది గమనించికూడా గమనించనట్టే ప్రవర్తించేవాడు.

ఒకరోజు సాయంకాలం కమలాదేవి రోజుకంటె గొప్పగా ముస్తాబై బండీ పిలిపించింది, మీనాక్షమ్మా వారింట్లోకి వచ్చి ఆవిడతో "ఏమండీ. మీ రివ్వాళ కాస్త ఒక్కగంట తీరుబాటు చేసుకొని నాతో బజారు రావాలి" అంటూ బలవంతం చేసింది.

"ఎక్కడకండీ"

"బట్టలకొట్టుకు. బేరం అదీ నాకు బాగా తెలియదు—గుడ్డ నాణ్యం అంతకంటే తెలియదు. ఒక్కసారి మీరురండి—మళ్ళీ ఇప్పుడే వచ్చేద్దాము" అని బ్రతిమిలాడింది కమలాదేవి,

'కాత్యాయని వెళ్ళాక మళ్ళీ బట్టలకొట్టుకు వెళ్ళి ఒక్క చీరైనా చూడలేదు. కట్టుడు చీర కొనుక్కోమని ఆయన ఇరవై యిచ్చారు. నేనూ నీలయితే ఇప్పుడే ఒకటి కొనుక్కోవచ్చు' అని అనుకొంటూ మీనాక్షమ్మ "సరేనండి" అంటూ పని తెమల్చుకొని ఆమెతో బజారుకు బయలుదేరింది.

మామూలుగా తను వెళ్ళే బట్టలకొట్టుకే ఆవిడా వస్తుందనుకొని ఆ కొట్టు కనపడగానే బండి ఆపించమని అన్నది మీనాక్షమ్మ. "ఇక్కడ కాదులెండి ఇంకాస్త పైకి వెళదాం రండి" అని ఆవిడ మరో పెద్ద కొట్టుకు తీసుకొని వెళ్ళింది. వారు వెళ్ళిన బట్టలదుకాణం చాలా పెద్దది. చుట్టూ అద్దాలూ—అద్దాల బీరువాలూ అమర్చబడిఉన్నాయి. పైన ఫేన్లూ, క్రింద తివాసీలూ అందంగా ఏర్పాటయి ఉన్నాయి.

మీనాక్షమ్మ లోపలకు అడుగు పెడుతూనే ఆశ్చర్యపడి పోయింది—ఆ లైట్లు వెయ్యమని ఎవరు ఎవరికి చెప్పారా అని అనుకొంటూ. ఆకొట్టు యజమాని పొడుగాటి తళతళా మెరుస్తున్న సిల్కు లాల్చీతో ముందుకువచ్చి కూర్చోమని కుర్చీ చూపించాడు వారిద్దరికీ. మీనాక్షమ్మను కూర్చోమని తనూ కూర్చుంటూ "ఏవైనా మంచి చీరలు చూపించండి" అన్నది కమలాదేవి.

ఆవిడ మాటతీరు—ఏదో పట్టిపట్టి మాటాడినట్లుగా — ఇంగ్లీషు చదువుకొని నాజూగ్గా, షోగ్గా మాటాడాలని ప్రయత్నంచేసే ఆడవారి మాటతీరులా ఉంటుంది.

మీనాక్షమ్మకు ఆవిడ అల్లా మాటాడడం అంత రుచింపదు.

ఆ కొట్టు యజమాని తన గుమాస్తాకు ఏదో చెప్పాడు ఇంగ్లీషులో.

ఆ గుమాస్తా ఆమాట వినీవినడంతో బీరువా అద్దాలను ప్రక్కకు జరుపుతూ ఒక్కొక్క అరలోంచి ఒక్కొక్క రకానికి రెండేసి చొప్పున ఇరవై చీరలుతెచ్చి వాళ్ళముందు వరుసగా ఒకదాని ప్రక్క ఒకటి పెట్టాడు.

మీనాక్షమ్మ ఆశ్చర్య పడింది.

ఆవిడ కొడుకు ఎదురుగాఉన్న పెద్ద నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూస్తూ—ఆశ్చర్యపోతూ—నవ్వుతూ—

కాసేపు జాగ్రత్త అన్నట్లు వేలితో బింబాన్ని హెచ్చరిస్తూ ఆడుకొంటూ ఉండిపోయాడు.

"ఏమండీ చూడండీ! ఏరంగు బాగుంటుందో" అని అడిగింది కమలాదేవి.

మీనాక్షమ్మ కాస్త తేరుకొని "ఆ. ఆ. అదేనండీ నేనూ ఆలోచిస్తున్నా" అన్నది తెలివిగా. "అన్నీ బాగానే వున్నాయే-ఇవన్నీ మంచి సిల్కుచీరలేనే" అన్నది.

కాసేపు ఇటువటూ అటువిటూ పడేసి చివరకు ఆవిడ వాటిల్లోంచి మూడు చీరలు ఏరి "మిగతావన్నీ తీసెయ్యండి" అన్నది.

కమలాదేవి ఆ మూడూ తీసుకొని వాటి నొకట్నొకటీ పరీక్షచేసి పదినిముషాలసేపు— లైటుకు ఒకసారి ఎదురుగానూ, ఎత్తుగానూ, ఒకసారి క్రిందుగా వంపుగానూ, పట్టుకొని కొంత సేపు చూచి "ఏదండీ వీటి పమిట కొంగులు చూపించండి" అన్నది.

ఆ గుమాస్తా వాటిని బల్లమీద విప్పి పరచాడు. ఆవిడ అందులో ఒక చీర తీసుకొని "ఏమండీ ఈ బోర్డరూ పమిట చెంగూ బాగున్నాయికదూ — రంగుకూడా బాగుంది — ఏమంటారూ—ఇది తీసుకోమంటారా?" అని అడిగింది.

"తీసుకోండి అదే బాగుంది" అని వెంటనే మీనాక్షమ్మ అనడానికైతే అనగలిగిందే కాని ఆమెకా మూడు చీరలూ

బాగానే ఉన్నాయి, ఆమె మరో క్షణమాగి "అది సరేగానీండి ఖరీదు అడగరేం" అన్నది.

ఆ కొట్టు యజమాని ఆ మాటకు వెంటనే అందుకొని "అయ్యో దానికేంలెండి — ముందు మీకు చీర నచ్చనీయండి అన్నీ ఫిక్సడ్ రేట్సేగా" అన్నాడు.

ఆమాట మీనాక్షమ్మకు అర్థంకాలేదు. బహుశా ధర ఇంగ్లీషులో చెప్పాడేమో ననుకొని ఊరుకొన్నది.

ఏమండోయ్ — ఏమైనా తేడావస్తే తిరగ్గొట్టేస్తా సుమండీ — సరిగా బిల్లుచేసి బిల్లు ఇల్లా ఇవ్వండి" అన్నది కమలాదేవి.

ఆయనేదో కాయితంమీద పెన్సలుతో రెండు గీతలతో చప్పున వ్రాసేసి అది చింపిఇస్తే ఆమె అంది పుచ్చుకొని— పమిటకొంగు కొంచెం తప్పించి లోపలినుండి పర్సుతీసి డబ్బు ఇచ్చేసి గుమ్మంలో పిల్లవాణ్ని పట్టుకొని నిల్చున్న మీనాక్షమ్మను కలుసుకొన్నది ఉబ్బిరికాగితంలో చుట్టి ఇచ్చిన సిల్కుచీర చేత్తో పట్టుకొని.

అంతవరదాకా ఆ చీర ఖరీదు ఎంతో మీనాక్షమ్మకు అర్థం కాలేదు. "బహుశా కొంచెం ఎక్కువే అయివుండాలి" అనుకొన్నది.

పిల్లవాణ్ని ఒళ్ళో కూర్చోబెట్టుకొని బండిలో కూర్చు న్నాక కొత్తచీర ఒళ్ళో పెట్టుకొని కళ్ళజోడు సర్దుకొంటూ

కూర్చున్న కమలాదేవితో మీనాక్షమ్మ ఇల్లా అన్నది. "ఇంతకీ ఆ చీర ఖరీదెంతండీ—అసలు మనం బేరం చెయ్యలేదే!"

"ఎంతలెండి నూట ఎనభై అయిదూ — ఫిక్సెడ్ రేట్సు అన్నాక మనం బేరం చెయ్యడం బాగుండదు—వాళ్ళు బేరం చెప్పరు. అయినా మనకు బాగుండకపోతే పంపించి వేస్తామని చెప్పాంగా" అన్న దావిడ చీర పైకెత్తి మళ్ళీ పరిశీలిస్తూ.

ఆమాటకు మీనాక్షమ్మ నిర్ఘాంతపోయింది.

"నూట ఎనభై య్యైదు రూపాయలా ఆ చీర" అను కొన్నది అప్రయత్నంగా, ఆశ్చర్యంగా.

"అంత ఖరీదుటండీ" అన్నది.

"అయినా అంతధర పెట్టేసి కొనేస్తే మీవారు కోప్ప డరా" అని కూడా అడిగింది మీనాక్షమ్మ అమాయికంగా.

కాత్యాయిని భర్త ఆమెను చీరకు పధ్నాలుగు పది హేనుకంటె ఎక్కువ ధర పెడితే నిజంగానే కేక లేసేవాడు.

తన భర్త అయినా అంతే. ఆ విషయాలు స్ఫురణకు వచ్చే అల్లా అడిగింది మీనాక్షమ్మ.

"అబ్బే కోప్పడటమా!" అన్న దావిడ.

ఇంటికి చేరేలోగా ఆవిడ నాల్గుసార్లు అడిగింది "ఏమండీ ఈచీర బాగుందా—మీరు మనస్ఫూర్తిగా చెప్పండీ" అని.

దారిలో పిల్లవాడు ఏదో చూపించి కొనమని ఏడిస్తే మీనాక్షమ్మ ఒక అణా పెట్టి బిళ్ళలుకొని వాణ్ణి సముదాయించింది.

ఇంటికి వచ్చిన తర్వాత వాడాపూట పెందరాళే నిద్రపోయాడు.

మీనాక్షమ్మ కాపూట ఎందుకో తోచలేదు.

రోజూ తనభర్త కూర్చుని వ్రాసుకొనే కుర్చీలో కూర్చున్నది.

చాలాసేపు అల్లా కూర్చుని ఏదో ఆలోచనల్లోపడి ఉండిపోయింది.

మనస్సులో ఎక్కడో ఏమూలో "నేనూ అటువంటిచీర కొనుక్కుంటే బాగుండును" అని ఒక కోరిక ఉద్భవించి మనస్సంతా కదులుతూ, పాకుతూ అంతలో అణగిపోవడం మొదలు పెట్టింది.

వానకురిసేవేళ కొండకొమ్ములను తాకుతూ తారాడే నీలమేఘాల్లాగా ఆ కోరికలే, ఆ ఆలోచనలే మాటిమాటికీ ఆమె మనస్సులో మెదలడం మొదలు పెట్టాయి.

ఆమెకు అసూయ కలిగింది. దాన్ని అతి ప్రయత్నం మీద ఆమె అణచుకొన్నది.

"అసలూ — నన్నావిడ బజారుకురమ్మని ఎందుకు పిల్చిందీ! అక్కడ చేరంచేసిందేముందీ! ఆవిడ అంత ధరపెట్టి

చీర ఎల్లా కొనగలిగింది! ఆమె భర్తకు నెలకు నూటయాభై య్యేగా జీతం—మరి నెలంతా ఎల్లా గడుపుకొంటారూ?"

"వెనక ఆస్తి ఏమైనా వుందేమో! లేదని ఆవిడ చెప్పిందిగా. లేకపోతే మరి....పై సంపాదన ఏమైనా వుండాలి" అనుకొన్నది మీనాక్షమ్మ.

"అవును ఈ ఉద్యోగాల్లో అందుకు అవకాశం ఉంటుంది. తాతగారు కరణీకం చేస్తూనే పొలం పుట్రా సంపాదించు కొన్నారు. పోనీ—వీరు కూడా ఆ వెధవ స్కూలుమాస్టరీ ఉద్యోగం మానేసి చక్కగా ఈ ఉద్యోగమే చెయ్యకూడదూ?" అని ఇల్లా ఏమేమో ఆలోచించింది మీనాక్షమ్మ. ఆమె కాసేపు మేజాబల్లమీద ఉన్న తెల్లకాగితాల పుస్తకాలూ, కొన్ని ఆయన వ్రాస్తున్న పద్యాల పుస్తకాలూ, మరికొన్ని దొంతరలుగా ఉన్న తెలుగు గ్రంథాలూ. ఆ అచ్చు పుస్తకాలన్నీ ఒకటొకటీ తీసి పేర్లు చదివి మళ్ళీ అక్కడ పెట్టేసింది. ఏమిటో—ఈయనకీ పుస్తకాలే లోకం—డబ్బు సంపాదన తెలియదు. చదువుకొంటున్న రోజుల్లోనూ అంతే. ఉద్యోగం చేస్తున్నప్పుడూ అంతే. ఇహ సంపాదించే దెప్పుడూ!"

"అదేమంటే ఇందులో ఉండే ఆనందం ప్రపంచంలో మరెక్కడుందే పిచ్చిదానా అంటారు ఆయనగారు" అనుకొన్నది మీనాక్షమ్మ.

ఆ పూట నాగేశ్వరావు ఇంటికి వచ్చేసరికి అట్టే ప్రొద్దు పోలేదు. అతను ఎనిమిదింటికే వచ్చాడు. అయినా మీనాక్షమ్మకు అతను రోజూకంటే ఆలస్యంగా వచ్చాడని పించింది.

"ఏమండీ యింత ఆలస్యంగా వచ్చారూ?" అని అడిగింది.

"అదేమిటే ఎనిమిదేగా అయిందీ—రోజూకంటే పెంద రాళే వస్తే" అన్నాడు నాగేశ్వరావు.

"రోజూ మీ రెక్కడకండీ వెళ్తారూ" అని అడిగింది మీనాక్షమ్మ భర్తకు ఎదురుగా నిలబడి.

మీనాక్షమ్మ ఆ పూట మామూలుగా కట్టుకొనే తెల్ల చీరె కట్టుకొన్నది. ఎఱ్ఱపూల తెల్లజాకెట్టు వేసుకొన్నది.

అతనికి మామూలుగా తెల్లచీరమీద నీలంరంగు సాదా సిల్కు జాకెట్టు వేసుకొంటే బాగుంటుంది.

"తెల్ల చీరమీద ఎఱ్ఱపూల జాకెట్టు ఇంత అందంగా ఉంటుందన్నమాట" అనుకొంటూ ఆమెవంక చూస్తూ ఉండి పోయాడు నాగేశ్వర్రావు.

ఆమె మళ్ళా అడిగింది.

"ఎక్కడి కేముందీ — మా శాస్త్రిగారింటికే వెళుతుం టాను. ఏదో కావ్యాలగురించి కాసేపు మాటాడుకొని అల్లా తిరిగివస్తాం. ఇవ్వాళ ఆయనలేరు." అన్నా డతను.

అది విన్నాక మీనాక్షమ్మకూ ఎంతసేపూ అతని కా పుస్తకాలగొడవే తప్ప డబ్బు సంపాదన పట్టడంలేదని నిర్ధారణ అయింది. "ఏమండీ ఊరికే అల్లా తిరక్కపోతే — ఏమైనా కాస్త పై సంపాదనకు మార్గం ఆలోచించకూడదూ!" అన్నది.

"ఏదోవుంది — లేకపోతే అది ఇల్లా అనదు" అని అను కొంటూ "సంపాదిస్తూనే ఉన్నాగా చాలదూ ?" అన్నాడు నాగేశ్వరావు.

"ఏం సరిపోవడంలెండి. అదికాక పైన ఇంకేమి సంపా దించలేరా—అ తహసీలుదారుగారిలాగా" అన్నది.

"అదేమిటే — ఆయనల్లా సంపాదిస్తున్నాడని ఎవ రన్నారూ—ఊరుకో — ఊరుకో ఎవరైనా వింటే లేనిపోని రభసవుతుంది."

"పోనీలెండి మీ సంగతి చెప్పండి. మీకు పైసంపాదనకు వీలు లేదా ?"

"వీలెందుకు లేదూ — ఏదో రెండు ప్రైవేట్లు చెప్పు కొంటే మరో ఇరవై రాకపోవు. కాని అబ్బ అదంతా చాలా అవస్థే. అక్కడ బళ్ళో పిల్లలతో అన్ని గంటలు కొట్టుకొని కొట్టుకొని వచ్చి మళ్ళా ఇక్కడ చెప్పుకోవడమంటే యమ యాతనగా ఉంటుంది. అని "సరే పద వడ్డించు భోజనం చేద్దాం" అన్నాడు నాగేశ్వరావు చొక్కా విప్పి వంకెకు తగిలిస్తూ.

అతను భోజనంచేస్తూ నవ్వుతూ "ఏం విశేషం —ఇవ్వాళ అల్లా ఉన్నావ్" అన్నాడు.

మీనాక్షమ్మ జరిగిన విషయం అంతా చెప్పింది. చెప్పి "ఆవిడ అలాగా నూట ఎనభై పెట్టి చీర కొనేసింది చూశారా!" అన్నది.

"అహా — అదా సంగతీ—"అని ఒక చిరునవ్వు నవ్వి "పిచ్చిదానా—అటువంటి చీరలు మనకు దేనికీ! అసలు నువ్వు ఏ చీర కట్టుకొన్నా బాగుంటావ్—అసలు బాగుండనివాళ్ళు చీరలకోసం తాపత్రియపడతారు" అన్నాడు.

పక్కి దులిపి వేస్తూ "ఈ నెల నేనూ ఒక చీర కొనుక్కొంటాను" అన్నది మీనాక్షమ్మ.

"అల్లాగే కొనుక్కో. నీదగ్గరఉన్నది చాలదంటే మరో పది ఇస్తాను. మంచిదే కొనుక్కో" అన్నాడు—పుస్తకం ఒకటి తెరిచి పడుకొని చదువుకొంటూ.

ఆమె అప్పటికి సంతోషించింది.

ఆ నెల ఫస్టు తారీఖున బియ్యపు కొట్లో కొంత బాకీ అట్టేపెట్టి నాగేశ్వర్రావు ఆమెకో పది రూపాయలు ఇచ్చాడు. అల్లాగా ఇచ్చి ఆ పదీ పూడ్చే ఉపాయాలు కొన్ని అన్వేషించాడు. కొన్ని చిల్లర ఖర్చులు తగ్గించుకొన్నాడు.

ఆమె ఆ నెలే కాదు — ఉన్న ముప్పై రూపాయలకు మరో పది వచ్చి చేరినా మరుసటి నెలలో కూడా చీర కొనుక్కోలేదు.

ఒకసారి అతను "అదేమో — చీర కొనుక్కుంటా నన్నావ్—కొనుక్కోలేదేం" అని అడిగితే ఆమె వెంటనే సమాధానం చెప్పింది కాదు.

క్షణంలో అతనికి కోపం వచ్చింది.

అంతలో బొమముడి విడిపోయింది.

ఆమెను నెమ్మదిగా మందలించాడు.

ఆమె నీ రెండు నెలలనుండీ గమనిస్తూనే ఉన్నాడతను. ఆమెలో అజ్ఞాతంగా దాగిఉండి బాధ పెడుతున్న విషయాన్ని అతను ఇట్టే గుర్తించాడు. "నువ్వు అనవసరంగా పెద్ద ఎత్తులకు పోబోయి అకారణంగా బాధపడుతున్నావ్—అది మంచి పనిగాదు" అన్నాడు.

మీనాక్షమ్మ కాస్త నవ్వుముఖంపెట్టి "అబ్బే అదేమీ కాదండీ — ఇప్పుడు కట్టుడుచీర లున్నాయికదా — దేనికి కొనడం అని ఊరుకొన్నా" అన్నది.

ఎల్లాగయినా అటువంటిచీర కొనాలని ఎప్పుడో నిశ్చయం చేసుకొని ఆ నిశ్చయాన్ని మనస్సులో గుప్తంగా ఉంచుకొన్నది మీనాక్షమ్మ.

నాగేశ్వరావుకు ఆమె చెప్పినది సంతృప్తికరంగా లేక పోయినా విని ఊరుకొన్నాడు.

ఆమె క్రమంగా తన సొంత ఖర్చులు కొన్ని కొంత ప్రయత్నంమీద తగ్గించుకొన్నది. సాయంకాలంపూట ఇంట్లో కాఫీ పెట్టుకోవడం మానివేసింది. తరచు పూలుకొనడం తగ్గించింది.

అతని కా విషయంలో కొంచెం కష్టం కలిగి కోపగించుకొన్నాడు.

క్రమంగా కొన్ని నెలలు గడచిన తర్వాత మీనాక్షమ్మ దగ్గరఉన్న ముప్పై, ఎనభై రూపాయ లయినాయి. ఆమె అన్నగారు సంక్రాంతిపండక్కు చెల్లెల్ని, బావగార్ని పిలిచాడు.

"నేను రానులే—ఈ సారి నువ్వు వెళ్ళిరా" అని ఆమెను పంపించాడు నాగేశ్వరావు.

ఆమె తిరిగి వచ్చేటప్పుడు పండగచీర తెచ్చుకోకపోవడం చూచి నాగేశ్వరావు ఆశ్చర్యపోయాడు. తరువాత నెమ్మదిగా ఆవిషయం ప్రస్తావనకు తెచ్చి అడిగాడు. ఆమె కొంత దాచి కొంత చెప్పింది.

తొట్రుపడుతూ సమాధానం చెప్పింది. "అబ్బే ఏమీ లేదండీ—మా అన్నయ్య మీరూ వస్తారనుకొన్నాడు. మన ఇద్దరినీ కొట్టుకు తీసుకొనివెళ్ళి మనకు నచ్చినవి కొందామనుకొన్నాడట. మరి మీరు రాలేదుగా — అందుకని డబ్బు ఇచ్చాడు. ఇక్కడ కొనుక్కోమని" అన్నది మీనాక్షమ్మ.

అతనామాట నమ్మలేదు. అబద్ధమాడిందని అతనికప్పుడే అర్థమయింది, అబద్ధంఆడితే అతికేటట్లు ఆడాలి, ఆడవాళ్ళు కొంతనుంది మహాచక్కగా అబద్ధం ఆడేస్తారు. అబద్ధం ఆడటం కూడా ప్రత్యేకమైన నేర్పే. దీనికిది అబ్బలేదు. అదే మంచిదిలే." అనుకొన్నాడు ఆమెను చూచి నవ్వుతూ.

"అయితే ఇంకేం—భలే ఎత్తువేశావన్నమాట. ఏమాత్రం గిట్టిందే!" అన్నాడు.

"నలభై" అన్నది మీనాక్షమ్మ గర్వంగా సంతోషంగా.

"సరే—మంచి లాభమే సంపాదించావే" అని ఒక్కక్షణ మాగి "అయితే ఇంతకూ నీ పన్నాగమంతా ఆవిడగారుకొన్న చీరలాంటిది కొనాలని కదూ" అన్నాడు చిరుకోపాన్ని ప్రకటిస్తూ.

మరోక్షణానికి అతనికి నిజంగానే కోపం వచ్చింది. ఆమె అతనికి సమాధానం చెప్పకుండా లోపలికి వెళ్ళింది. పిల్లవాణ్ణి అతనిదగ్గిర దింపేసి.

ఆమె పడుతున్న తాపత్రయం అంతా అతనికి స్పష్టంగా అవగతమైంది. ఆమె కల్లాంటి చీరకొని ఇవ్వలేకపోయినందుకో క్షణం బాధపడ్డాడు. అందుకు కారణం తన అసమర్థతే నని అనిపించింది. "అబ్బే కాదు అటువంటివి మన కక్కర్లేదు" అనుకొన్నాడు మళ్ళీ. "నువ్వల్లా అనుకొంటున్నావు కాని ఆవిడ కావాలని అంతగా కోరుకొంటున్నప్పుడు పోనీ నువ్వు ఇవ్వ

గలిగావా!" అని ఎవరో హృదయం చాటున ఉండి అడిగి నట్లనిపించింది. "నిజమే" అనుకొన్నాడు నాగేశ్వరావు చివరకు.

అతను తను వ్రాస్తున్న కావ్యం అక్కడే ఆపేసి మరు నాడే తన మిత్రులతో తనక్కూడా ఒకటి రెండు ప్రైవేట్లు చూచిపెట్టమని అడిగాడు.

ఆ మాసాంతంలో ఆమెదగ్గిర ఉన్న నూటయిరవై రూపా యలకూ మరో ముప్పై రూపాయలు వచ్చి చేరాయి.

ఆ తరువాత నెలలో మీనాక్షమ్మ రూపాయల నోట్లన్నీ సమంగా లెక్కపెట్టి "నూటఎనభై. అమ్మయ్య" అనుకొని అవి పెట్టిలో పెట్టేసి భద్రంగా తాళంవేసింది పెట్టెకు.

అప్పటి కామె మనస్సు తేలికయింది పక్కి భాగం ఆవిడమీద ఏర్పడిన అసూయ క్రమంగా తగ్గిపోయింది.

అందువల్లనే ఆమె ఒక రోజు తమ ఇంటికి భోజనానికి పిలిస్తే సంతోషంగా వెళ్ళింది.

'ఎందుకండీ ఇప్పుడు భోజనాలూ' అన్నది మీనాక్షమ్మ. "రేపు నా పుట్టినరోజు పండగండీ" అన్నదావిడ.

ఆవిడ తన పుట్టినరోజు పండగ అంత ఆర్భాటంగా చేసు కోవడం చూచి మీనాక్షమ్మ కొంత ఆశ్చర్యపడినా అసూయ పడలేదు.

ఆరోజు మధ్యాహ్నం అంతా వెళ్ళిపొయ్యాక కమలాదేవి మీనాక్షమ్మను తన పడక గదిలోకి తీసికొని వెళ్ళి నాలుగూ చూపించింది.

కొంతసేపయిన తర్వాత ఆమె బీరువాతీసి తన చీరలన్నీ చూపించింది. ఆవిడ తన ఆధిక్యం అందరూ అంగీకరించి ఆశ్చర్య పడాలని కోరే వ్యక్తి.

మీనాక్షమ్మ కళ్ళు చెదిరిపొయ్యాయి.

ఆ చీరలన్నీ కొత్తవీ—పట్టువీ—మేలైనవీ.

వాటిని ఒకటొకటే తీసి మెల్లగా మీనాక్షమ్మ చేతి కిచ్చింది—అంచులు చూడమనీ—పమిట కొంగులు చూడమనీ అంటూ. ఆమె వాటిని ఒక్కక్షణం చూచి నలిగిపోతాయేమో నని భయపడుతూ జాగ్రత్తగా తివాసీమీద పెట్టేసింది.

"ఎప్పుడు కొన్నారండీ ఇవన్నీ" అన్నది.

"అబ్బె ఒక్కసారి కొన్నవి కాదండీ — అప్పుడొకటీ అప్పుడొకటీ కొన్నా" అన్న దావిడ.

అవన్నీ చాలా మట్టుకు ఖరీదైనవే. వాటిల్లో మీనాక్షమ్మ కళ్ళకు తలమానికంగా కన్పించింది ఒక చీర. దాన్ని ఎత్తి తీస్తూ "ఇది మనం ఇద్దరం వెళ్ళినప్పుడు కొన్నది కదండీ" అని మరో క్షణం పొయ్యాక "ఎంతండీ ఇది—అప్పుడు చెప్పారుగాని...." అనీ అడిగింది. ఆ చీరధర సమంగా

కనుక్కొని ఇంకా తన కెంత తక్కువవుతుందో తెలుసుకొందా మని అనుకొంటూ.

ఆవిడ పరధ్యాన్నంగా ధర చెప్పి — "మరో పదో ఇర వయ్యో పెడితే కాష్మీరు జరీఅంచుచీర వచ్చేది" అన్నది తానేదో పొరపాటుచేసి అందుకు విచారపడుతున్నట్లుగా ముఖం పెడుతూ. మీనాక్షమ్మ ఆవిడవంకనూ చూడలేదు. ఆమె అన్న మాటలు విననూలేదు. ఆమె ఆ చీరవంకే చూస్తూ మరో అయిదు — అయిదేగా" అనుకొన్నది.

"చాలా బాగుందండీ ఈ చీర" అని మెచ్చుకొన్నది మీనాక్షమ్మ.

ఆవిడ అందుకు నిజంగా సంతోషించింది. అదే ఆవిడ కోరికకూడానూ. ఆవిడకు అల్లాగా తన చీరలుచూచి సంతోషించే వాళ్ళంటే చాలా ఇష్టం. "అల్లాగాఅండీ" అన్న దావిడ. "మరేమీ అనుకోకపోతే—సాయంకాలం ఒకసారి నాకిస్తారూ-. మా వారికి చూపించి ఇచ్చేస్తా" అని అడిగింది మీనాక్షమ్మ.

"దానికేం భాగ్యమండీ—చూపించండీ" అన్న దావిడ ఆచీర అతనుకూడాచూచి మెచ్చుకుంటాడని మనస్సులో అను కొంటూ. ఆమె మళ్ళీ ఇల్లా అడిగింది. "ఏమండీ — మీకూ అల్లాంటిచీర కొనుక్కోవాలని ఉందాఅండీ" అని అడిగింది మీనాక్షమ్మ మనస్సులో ఉన్న భావాన్ని పసిపడుతూ.

మీనాక్షమ్మ తడబడింది.

"అబ్బే కాదండీ—ఆరంగు—ఆ ఊదారంగు చీర కొనుక్కుందామని అనుకొంటున్నా" అని అన్నది. ఆమె ఆమాట కొంచెం ఎగతాళిగా అన్నదేమోనని అనుమానపడుతూనే.

కమలాదేవి కొంచెం గర్వపడింది.

అంతలో కుర్రవాడు నిద్రలేచి ఏడుస్తుంటే మీనాక్షమ్మ తన ఆలోచనలనూ—ఆ చీరలనూ అక్కడ వదిలేసి చప్పున తన భాగంలోకి వెళ్ళిపోయింది.

ఆరోజు సాయంకాలం మీనాక్షమ్మ ముందున్న పంచపాళిలో కూర్చుని భర్త తొందరగావస్తే బాగుండునని అనుకొన్నది.

ఒకటి రెండుసార్లు లోపలకువెళ్ళి బల్లమీద ఉల్లిపొర కాగితంలో చుట్టిఉన్న సిల్కుచీరకేసి చూచి, మళ్ళీ ముందు గుమ్మంలో నిలబడి ఆ వీధిమలుపుకేసి ఒకసారీ, పంచపాళీ క్రింద ఇవకలో గూళ్ళు కడుతున్న కొడుకువంక ఒకసారీ చూస్తూ చాలాసేపు ఉండి పోయింది.

అంతలో పోస్టుజవాను వచ్చి ఉత్తరం ఒకటి ఇచ్చి వెళ్ళాడు.

ఆమె ఆ ఉత్తరాన్ని చదివి నవ్వుకొన్నది.

అంతలో కొంచెం కోపగించుకొన్నది. "ఏంపాపం వెళ్ళినప్పటినుంచీ ఒక్క ఉత్తరం వ్రాయించడానికి తోచలేదు" అనుకొన్నది. అది కాత్యాయిని భర్త వ్రాశాడు. ఆమె పురిటికి

వెళ్ళి పదిరోజుల క్రిందటే వచ్చిందనీ — రేపో ఎల్లుండో వీలు చేసుకొని వదినగార్ని చూడడానికి వస్తున్నదని వ్రాశాడతను.

మీనాక్షమ్మకు పట్టరానంత సంతోషం కలిగింది.

బల్లమీద ఉన్న చీరతీసి అలమారలో దాచి దాని స్థానంలో ఆ ఉత్తరాన్ని ఉంచింది. నాగేశ్వరరావు ఆ పూట వైద్వేటుకు వెళ్ళకపోవడంచేత కాస్త పెందరాళే వచ్చాడు. అతనువచ్చి ఆ ఉత్తరం చదువుకొన్నాడు. నవ్వుతూ భార్యతో "చూశావా—మీ కాత్యాయిని వస్తోందట" అన్నాడు.

"ఊరికేనే రావడంలేదు. మనకో కోడల్ని కనుక్కొని వస్తోంది." అన్నది మీనాక్షమ్మ సంతోషంగా.

ఇద్దరూ నవ్వుకొన్నారు.

"నీతో పోటీపడిందన్నమాట. వచ్చాక తెలుస్తుంది కాబోలు మళ్ళీ—ఇంకా తాను వెనకపడ్డానని" అన్నాడు నాగేశ్వరరావు.

ఆమె ముసిముసి నవ్వులు ఒలకపోసింది. భోజనానంతరం భర్తతో ఆ చీర ప్రస్తావన తెచ్చి దాన్ని చూపించడానికి అవకాశం కోసరం కాచుకొన్నది మీనాక్షమ్మ. మృదుపరిష్వంగానంతరం మీనాక్షమ్మ బుగ్గలు తడుముకొంటూ దూరంగా జరిగి అవతలకు వెళ్ళి అలమారలోనుంచి, తీసి ఆచీర అతనికిచూపిస్తూ— "చూడండీ ఈ చీర బాగుందా" అని అడిగింది నవ్వుతూ.

"అయితే అప్పుడే కొనేశావన్నమాట!" అన్నాడు.

"లేదు. ఈ చీర ఆవిడదీ మీకు చూపిద్దామని తెచ్చా బాగుందా ?"

"సరే — ఇంకేం రేపే ఆ అయిదూ ఇస్తాను కొనుక్కో" అన్నాడు నాగేశ్వర్రావు.

అలా అని అతను మరో క్షణం పొయ్యాక "రేపో ఎల్లుండో కాత్యాయిని కూడా వస్తుందిగా. ఆవిడ వచ్చాక ఆమెతో కలిసి వెళ్ళి కొని తెచ్చుకుందువుగాని- సరేనా ?" అన్నాడు.

ఆమె సంతోషంగా సరే నన్నది. కాత్యాయిన్ని కూడా ఒక్కసారిగా ఆశ్చర్యపరచవచ్చని అనుకొంటూ.

అంత డబ్బు — ఒక్క చీరకు ఖర్చు కాబోతోందే అని కొంత మనస్సులో మథనపడ్డా ఆమెకంత సంతోషం-సంతృప్తి కలిగింపబోతున్నాను గదా అని ఆనందించాడు నాగేశ్వర్రావు అప్పటికప్పుడే ఆ చీర పట్టుకొని వెళ్ళి ఆవిడకు ఇచ్చేసి "మావారు కూడా ఈచీర బాగుందన్నారండీ" అని చెప్పి వచ్చేసింది మీనాక్షమ్మ.

మీనాక్షమ్మా వాళ్ళు అనుకుంటున్నట్లుగానే కాత్యాయిని మరో రెండు రోజులకే వచ్చింది. ఆమె రావడం ఆ యింటికి పండగ వచ్చినట్లయ్యింది.

మీనాక్షమ్మ కోడల్ని ఎత్తుకొని పదే పదే ముద్దాడితే కాత్యాయిని అల్లుణ్ని ఎత్తుకొని క్రింద దింపలేదు.

మీనాక్షమ్మ కోడల్ని ఎత్తుకొని భర్తదగ్గిరకు వెళ్ళి అతనికి ఎత్తుకోమని ఆ పిల్ల నిస్తూ "చూడండీ — మన వాడికి చక్కని పెళ్ళామే దొరికిందండీ" అన్నది. అల్లా అని దూరంగా పిల్లవాణ్ని ఎత్తుకొని నిల్చున్న కాత్యాయినితో "ఏమే కాత్యాయినీ—నిజంగా మా వాడికిచ్చి చేస్తావు టే?" అన్నది నవ్వుతూ నిష్కపటంగా, అమాయకంగా.

"ఒసేయ్—పెళ్ళిబాగుల్దానా. నువ్వు కాస్త బెట్టుగా ఉండాలి. మనమే అల్లాగా అడిగితే పల్చనయిపోతామ్" అన్నాడు నాగేశ్వర్రావు.

"ఓహో అల్లాగా—అయితే అన్నగారీ మధ్య కాస్త బెట్టు నేర్చుకొన్నారన్నమాట — ఈమాటు ఆడపిల్ల పుడితే తెలిసివస్తుంది అన్నయ్యగారికని" అల్లా అని కాత్యాయినే మీనాక్షమ్మవంక తిరిగి "ఏమమ్మోయ్ మా అమ్మాయిని చేసుకో దల్చుకొనేవాడు. మాకో అర్జీ పెట్టుకోవాలి" అన్నది నవ్వుతూ. "ఆహా—అల్లాగేం పాపం. మా అబ్బాయి కావాలనుకొన్న పిల్ల తల్లీ—తండ్రీ ఇద్దరూ కలసి కట్నాలూ, కానుకలూ పట్టుకొని మా గుమ్మంలో పడిగాపులు కాయాలి" అన్నది మీనాక్షమ్మ. "ఓహోహో—భలే గడుసుతనం నేర్చిందే వదిన గారు" అన్నది కాత్యాయిని.

"గడుసుతనమే కాదు-పెద్దఎత్తులే వేస్తోంది" అన్నాడు నాగేశ్వరావు.

ఆ ఆడవాళ్ళిద్దరూ వంటఇంట్లోకి దారితీసి, ఓహో అంటే అహో అనుకొంటూ పిల్లల్ని ఎత్తుకొని లోపలకు వెళ్ళారు.

ఆ మరునాడు ప్రొద్దుట నాగేశ్వర్రావు మామూలుగా బడికివెళ్ళాక మీనాక్షమ్మ "ఏమే బజారు వెళ్ళివద్దాం వస్తావా?" అని అడిగింది కాత్యాయిన్ని.

"ఏం ఉగ్గుగిన్నెలు కొనాలా"

మీనాక్షమ్మ అంతలో సిగ్గుపడింది. అంతలో సిగ్గుతెరను ముఖంనుండి తప్పించుకొని "అవన్నీ ఆడబిడ్డల బాధ్యతలు" అన్నది. అయితే ఇంకేం కాస్త బస్తీనీరూ — భర్తయింటి తిండీ వంటబట్టిందన్నమాట. ఆడబిడ్డనికూడా లెక్కలేకుండా మాటకుమాట అనేస్తున్నావ్" అని మరోక్షణ మయ్యాక పిల్ల దాన్ని ఒళ్ళోకు తీసుకొంటూ "అయితే ఇప్పుడు చెప్పు — ఎందుకూ బజారుకు?" అడిగింది కాత్యాయిని.

మీనాక్షమ్మ నిముషంలో నిజమంతా చెప్పేసింది. ఒక సారి లేచి ప్రక్కభాగంలోకి వెళ్ళి ఆ చీరతెచ్చి కాత్యాయినికి చూపించి తిరిగి ఇచ్చేసి వచ్చింది.

కాత్యాయినికి క్రమక్రమంగా కోపంవచ్చింది. కాసేపు ఆమెవంక తీక్షణంగా కోపంగా చూచింది.

ఇదేమా అని ఆశ్చర్యపోయింది మీనాక్షమ్మ.

"డబ్బుతీసి చూపించు ఎంతవుందో" అన్నది కాత్యాయిని పిల్లకు మరోవైపు పాలుఇస్తూ.

మీనాక్షమ్మ డబ్బు ఆమె ఎదురుగానే లెక్కపెట్టి ఆ పర్సు ఆమె ఎదురుగానే పెట్టింది. కాత్యాయిని ఆ పర్సు గబుక్కున అందిపుచ్చుకొని ఒళ్ళో పెట్టుకొని "అన్నయ్యకు తెలియకుండా చేస్తున్నావన్నమాట ఈ పనంతా" అని అన్నది. "అబ్బే — వారికి తెలుసును. అదంతా వారిచ్చిందే" అన్నది మీనాక్షమ్మ నెమ్మదిగా.

"ఏంకాదు. ఒకవేళ అదే నిజమైతే నువ్వు ఇమ్మని పోరుపెట్టి ఉంటావు" అన్నది కాత్యాయిని.

మరోక్షణమాగి ఆమె మళ్ళీ ఇల్లా అన్నది.

"ఏమమ్మా వదినా—నీకీ మధ్య మతేమైనా పోయిందా ఏమిటీ—ఎవరు చెప్పారమ్మా నీకీ పని చెయ్యమనీ – చెప్పిన వాళ్ళ సంగతి అల్లాఉండనియ్ – అసలు నీకెల్లా జ్ఞానంలేకుండా పోయింది–మన మేమైనా జమీందార్లమా, కలక్టర్లమా – పోనీ ఆఖరికీ ఓ తహసీలుదారిగారి భార్యమైనాకాదే- పైగా పిల్లల్ని కంటున్న దానివికదా—నీకీ మాత్రం తెలియనక్కర్లా–ఓగుడ్డ ముక్కకు నూటఎనభై తగలేస్తామా మనబోటివాళ్ళం — ఎవరో పిల్లా పాపాలేనివాళ్ళలాగా. ఆకాస్త చేతిలోఉంటే ఎంత నిబ్బరంగా ఉండొచ్చూ — ఏదైనా అవాంతరంవచ్చినా ఆదుకోవచ్చుని. అయినా తెలియకడుగుతా నీకింత గర్వ మెప్పు

దొచ్చిందే!" అంటూ కాత్యాయిని స్వతంత్రింగా నాల్గు చీవాట్లు పెట్టింది.

చీవాట్లన్నీ తిన్నది మీనాక్షమ్మ నోరెత్తకుండా. ఆమె యథార్థంచెప్పిందని ఆ మీనాక్షమ్మకు నిశ్చయంగా తోచింది.

"నామంచికే చెప్పింది" అనుకొంటూ అన్ని చీవాట్లూ అయ్యేదాకా ఆమె నోరు మెదపలేదు. చివరకు మీనాక్షమ్మ ఆలోచనలోపడి తెప్పరిల్లి "అవునే కాత్యాయినీ నువ్వన్నదే బావుంది. సరేగాని యింత కష్టపడి పోగుచేసినసొమ్ము ఆయన గారికి గనక తిరిగి ఇచ్చేస్తే అనవసరంగా ఇట్టే ఖర్చయిపోతుంది. ఈమధ్య ఆయన కిల్లీలూ, సిగరెట్లూ —— కాఫీలు కాస్త తగ్గించారు" అంటూ ఆమె తను ఆ సొమ్ము కూడబెట్టిన విధానం అంతా సమగ్రంగా చెప్పింది.

"మొత్తంమీద చాలా పెద్దపట్టు పట్టావే – " అన్నది కాత్యాయని ఆవిడ చేసిన కృషిని అభినందిస్తూ.

ఆ రోజు సాయంకాలం కాత్యాయినే మీనాక్షమ్మను వెంటబెట్టుకొని వెళ్ళింది బజారుకు.

"ఎక్కడికే —— అని గానీ —— ఎందుకే అని గానీ అడగ డానికి మీనాక్షమ్మకు ధైర్యం చాలక ఊరుకొన్నది.

కాత్యాయిని సరాసరి ఆమెను వెండి కొట్టుకు తీసుకొని వెళ్ళింది.

వాళ్ళిద్దరూ నడిచే వెళ్ళి, నడిచేవచ్చారు.

ఆ రాత్రి భోజనాలప్పుడు కాత్యాయని దగ్గిరఉండి మీనాక్షమ్మచేత నాగేశ్వరావుకు వడ్డింపించింది.

మీనాక్షమ్మ నెయ్యి వడ్డిస్తూండగా ఆ కంఠంపైన కొంచెం ముందుకు తూలి తిరిగి కంఠాన్ని అంటుకొని అందంగా తళతళా మెరుస్తున్న గొలుసువంక చూచాడు నాగేశ్వర్రావు. "ఎవరి దదీ—కాత్యాయినిదా అది" అని అడిగాడు కాదేమో అని అనుమానిస్తూనే.

"కాదు" అన్నది మీనాక్షమ్మ నవ్వుతూ. నాగేశ్వర్రావు కొంచెం ఆశ్చర్యపోయాడు.

అందుకు కాత్యాయిని సంతోషిస్తూ "అవునండీ — అది ఆవిడదే. ఇవ్వాళే కొన్నాం. బాగుందా" అని అతను సమాధానం చెప్పకముందే లోపలకు వెళ్ళి, ఒక వెండిపళ్ళెం — అందులో ఒక వెండి కొమ్ముచెంబూ పెట్టుకొని తిరిగి వచ్చింది.

అత నవన్నీ చూచి సంతోషిస్తూ 'అయితే ఇదంతా మీ షనన్న మాట" అన్నాడు.

"అవునండీ - నేనా చీర కొంటదామంటే వద్దని మీ చెల్లాయిగారు ఇల్లా ఖర్చుపెట్టారు. మొత్తంమీద ఆ డబ్బు ఖాళీ" అన్నది మీనాక్షమ్మ నవ్వుతూ.

కాత్యాయిని కొంతసేపయిన తర్వాత ఇల్లా అన్నది. "చూడు వదినా — ఇవైతే నాల్గు కాలాలపాటు పడిఉంటాయి. విలువా ఉంటుంది. ఉపయోగమూ ఉంటుంది. అదల్లా ఉంచు— మరో విషయం చెప్పనా? ఎప్పుడైనా ఏదైనా అవాంతరంగా డబ్బు అవసరమైతే ఇవి తాకట్టుపెడితే తేలిగ్గా అరవయ్యో, డెభ్భైయ్యో వస్తాయి. ఆ చీర అయితే ఇట్టే పోతుంది — తాకట్టుకూ పనికిరాదు. అయినా ఆ మెరుపులు మనకు దేనికమ్మా !"

కాత్యాయిని అనుభవజ్ఞతకూ — జాగ్రత్తకూ ఆశ్చర్యపోతూ ఆనందించాడు నాగేశ్వర్రావు.

"ఈసారి పురిటికి వదినగార్ని మా యింటికి తీసికెళతానండీ అన్నగారూ" అన్నది కాత్యాయిని.

అతను చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు భార్యవంక చూస్తూ.

అతను భోజనం చేసి తన పక్క తీసికొని ముందు గదిలోనే పరుచుకొన్నాడు. ఆడవాళ్ళిద్దరూ ఆ హాల్లో పడుకోడానికి అవకాశం కల్పిస్తూ.

భోజనా లయ్యాక వంటయింటి తలుపు తాళంవేసి కాత్యాయిని అన్నగారికి మంచి నీళ్ళూ తాంబూలమూ పంపింది.

మీనాక్షమ్మ అంతకాలంగా తన్ను వేధించిన అర్థంలేని అకారణమైనబాధ అంతంకాగా, నిశ్చింతగా చిరునవ్వు నవ్వుతూ వాలుజడలోని పువ్వులు సద్దుకొంటూ అతను కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చి, తాంబూలం అందించి ప్రాంకంగా పలుకరించింది.

అతను ఆమెవంకచూచి చిరునవ్వు నవ్వాడు. పుస్తకం మూసేసి, బల్ల ముందుకు జరిపి, ఆమె దగ్గరగా ఎదురుగా వచ్చాడు.

ఆమె నెమ్మదిగా వెనక్కు జరిగి ముక్కుమీద వేలువేసుకొని నవ్వుతూ నిలబడింది.

ఆమె ఏదో అన్నట్లనిపించిం దతనికి.

అతను "ఆహా అల్లాగా" అన్నాడు.

సరస కావ్యంలాంటి చమత్కారాన్ని విని, ఆనందంతో విశాలమై — రసమయమై ప్రశాంతమైన ట్లనిపించింది అతని హృదయం. అత నక్కడే నిలబడ్డాడు.

ఆమె హంసలా మెల్లగా ప్రక్కగదిలోకి వెళ్ళి తలుపు వేసుకొన్నది.

ప్రక్క గదిలోనుంచి వినపడుతున్న గుసగుసలూ, పకపకలూ వింటూ నిద్రపోయాడు నాగేశ్వరావు.

మరునాడే కాత్యాయిని ప్రయాణమై మీనాక్షమ్మ సామాను సద్దింది.

బండిలో సామాను సద్దినతర్వాత కూడా మీనాక్షమ్మ వెనక్కు వచ్చి భర్తతో ఏదో చెప్పబోయి, సిగ్గుపడి ఓ క్షణం నిలబడింది.

"రావమ్మా వదినా — కూతుర్ని ఎత్తుకొని వేగిరం వచ్చేద్దువుగానిలే. రా రా" అని పిల్లల్నిద్దర్నీ బండీలో కూర్చోబెట్టి తనూ ఎక్కింది !

